

భూసమస్యల పరిష్కారానికి

అడుగులు

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

(వివరాలు 6లో..)



చుక్కలు కనబడుతున్నాయ్!



వైసీపీ హయాంలో భారీగా అక్రమాలు.. డబ్బులు తీసుకుని ఇష్టారాజ్యంగా రిజిస్ట్రేషన్‌లు

ఫ్రీ హోల్డ్, నిషేధిత, ప్రభుత్వ భూములతో దందా

ఇంటి పట్టాలను అమ్ముకున్న వైసీపీ నాయకులు

అప్పటి మంత్రి ఉష శ్రీచరణ్ కనుసన్నల్లో మాయ

అక్రమాల నిగ్గుతేల్చే పనిలో ప్రభుత్వ యంత్రాంగం

కళ్యాణదుర్గం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ అయిన ఫ్రీహోల్డ్ భూములు, నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూముల వివరాల పునః పరిశీలన సాగుతోంది. కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలో వీటి దందా భారీగా సాగింది. ఈ కారణంగా మొత్తం 3,203 మంది యజమానులకు చెందిన 12,393 ఎకరాలను 22ఏ జాబితా నుంచి విముక్తి కల్పించడంపై నీలినీడలు కమ్ముకున్నాయి. వైసీపీ హయాంలో ప్రభుత్వ భూముల దోపిడీ అడ్డు అదుపులేకుండా సాగింది. వీటిని వెలికితీసే పనిలో కూటమి ప్రభుత్వం నిమగ్నమైంది. గడిచిన ఐదేళ్లలో ఎన్ని ఎకరాల ప్రభుత్వ భూములకు పట్టాలిచ్చారు, ఎన్ని ఎకరాల చుక్కల భూములను చక్కబెట్టారు, నిషేధిత జాబితా నుంచి ఎంత తొలగించారనే వివరాలను ప్రభుత్వం ఆరా తీస్తోంది.

ఇంటి స్థలాలతో మొదలు..

వైసీపీ హయాంలో పేదలకు ఇంటి స్థలాల పట్టాల పంపిణీ నుంచే దోపిడీ ప్రారంభమైంది. కంబదూరు, కళ్యాణదుర్గంలో పనిచేసిన తహసీల్దార్లకు వైసీపీ నాయకులు డబ్బులు ఇచ్చి ప్రైవేటు వ్యక్తుల పేరిట పట్టాలు రాయించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇళ్ల పట్టాలను కొట్టేసి విక్రయించారు. వచ్చిన డబ్బును పంచుకున్నారు. ఈ రెండు మండలాల్లో 22ఏ జాబితాలో ఉన్న భూములపై అప్పట్లో వైసీపీ నాయకుల కన్ను పడింది. మంత్రి ఉష శ్రీచరణ్ కనుసన్నల్లో అక్రమ మార్గంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. అడిగినంత డబ్బు ఇస్తే ఎటువంటి ఆధారాలు లేకున్నా నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించారు. కొందరు నేతలు సెటిల్‌మెంట్ భూములను 22ఏలోకి చేర్పించి, భూ యజమానులను ముప్పతిప్పలు పెట్టారు. ముక్కుపిండి వసూలు చేశారు. నియోజకవర్గంలో చుక్కల భూముల సమస్యలను పరిష్కరించేందుకు భారీగా డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఆ భూములపై ఆరా..

సీసీఎల్ఏ అధికారులు ప్రధానంగా 22ఏ, చుక్కల భూముల నుంచి ఎన్ని ఎకరాలు తొలగించారనే వివరాలను సేకరిస్తున్నారు. ప్రభుత్వ డీకేటీ భూముల్లో ఎన్ని ఎకరాలకు పట్టాలు ఇచ్చారు, ఫ్రీహోల్డ్‌గా ఎంత చేశారు, మాజీ సైనికులకు ఎంత భూమి ఇచ్చారన్న వివరాలను సేకరిస్తున్నారు. వీటితో పాటు వ్యవసాయేతర భూమిగా ఎంత విస్తీర్ణాన్ని మార్చారో.. ప్రతి మండలం నుంచి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది. 2019 నుంచి 2024 జూలై 23 వరకు ఉన్న వివరాలను కోరినట్లు సమాచారం. ప్రభుత్వ భూమిలో జగనన్న కాలనీలకు ఎంత ఇచ్చారు, ఇతర అవసరాలకు ఎంత కేటాయించారో కూడా ప్రభుత్వ యంత్రాంగం ఆరా తీస్తోంది. ముఖ్యంగా చుక్కల భూమి వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిసింది.

నాటి మంత్రి దందా

చుక్కల భూముల వ్యవహారంలో అప్పటి మంత్రి ఉష శ్రీచరణ్ పెత్తనమే సాగింది. తాను చెప్పిన విధంగానే పనిచేసే తహసీల్దార్లను ఆమె నియమించుకున్నారు. వేల ఎకరాలను రిజిస్ట్రేషన్ చేయించి, లక్షలాది రూపాయలు దండుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో చుక్కల భూముల దందాపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఉష శ్రీచరణ్ అక్రమాలన్నీ ఇప్పుడు బయటకు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఐదేళ్ల భూదోపిడీ అధికారుల విచారణలో బహిర్గతమయ్యే అవకాశం ఉంది. దీంతో ఉష శ్రీచరణ్ మాటలకు తలూపిన అధికారులకు గుబులు పట్టుకుంది. మంత్రికి అత్యంత సన్నిహితంగా ఉండే ఓ ఆర్ఐ ఈ భూముల వ్యవహారంలో కీలకంగా వ్యవహరించారని ఆరోపణలు ఉన్నాయి. ఆ ఆర్ఐ సహకారంతోనే చుక్కల భూముల అక్రమాలను ఉష శ్రీచరణ్ చక్కబెట్టారని అంటున్నారు. ఇవన్నీ అధికారుల మెడకు చుట్టుకుంటున్నాయి.





కళ్యాణదుర్గం ఆర్డీవో కార్యాలయం

డబ్బులిస్తే దర్జాగా రిజిస్ట్రేషన్

వైసీపీ పాలనలో కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. డబ్బులు తీసుకుని చుక్కల భూములను దర్జాగా రిజిస్ట్రేషన్ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అప్పటి మంత్రి ఉషశ్రీచరణ్ కనుసన్నల్లోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయమంతా పనిచేసింది. అప్పటి సబ్ రిజిస్ట్రార్ ఉష శ్రీచరణ్‌కు తొత్తుగా వ్యవహరించారని, ఆమె చెప్పిందే వేదంగా భావించి చుక్కల భూములను రిజిస్ట్రేషన్ చేశారని ప్రచారం జరిగింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి వచ్చిన అక్రమ ఆదాయాన్ని ప్రతి రోజు వాటాలు వేసుకునేవారని తెలిసింది. తాజాగా జరుగుతున్న పరిశీలనలో ఇవన్నీ బటయకు వస్తాయని అక్రమార్కులు ఆందోళన చెందుతున్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి దుర్మార్గం

ఖండించిన ఉపాధ్యాయ సంఘాలు

నల్ల రిబ్బన్లు ధరించి ఉపాధ్యాయుల నిరసన





నల్లరిబ్బన్లతో నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు, ఎన్టీఏ నాయకుల కొవ్వొత్తుల ప్రదర్శన

అనంతపురం విద్య, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో ఉపాధ్యాయుడు ఇజాజ్ అహ్మద్‌పై తరగతి గదిలో విద్యార్థులు దాడి చేయడం దుర్మార్గమని ఉపాధ్యాయ సంఘాల నేతలు అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాఠశాలల్లో నల్ల రిబ్బన్‌లు ధరించి గురువారం నిరసన తెలిపారు. జిల్లా కేంద్రంలో డీఈఓ ప్రసాద్ బాబును కలసి పలువురు సంఘాల నేతలు వినతిపత్రాలను అందజేశారు.

● ఉపాధ్యాయ భవన్‌లో ఏపీటీఎఫ్ నాయకులు సమావేశం నిర్వహించారు. టీచర్లపై దాడులను సహించబోమని హెచ్చరించారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, పూర్వపు రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, నాయకులు సతీష్‌కుమార్, వెంకటరమణ, లక్ష్మీనారాయణ, తిప్పేస్వామి, హనుమంతు, రామమూర్తి, సుహేల్, బాబ్జాన్, కలీముల్లా తదితరులు పాల్గొన్నారు.

● క్లాక్ టవర్ గాంధీ విగ్రహం వద్ద ఎన్టీఏ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉర్దూ టీచర్ ఇజాజ్ అహ్మద్‌పై విద్యార్థులు దాడి చేసి చంపేయడం హేయమని అన్నారు. విద్యాబుద్ధులు చెప్పే టీచర్లకు రక్షణ లేకుంటే ఎలాగని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం కమిటీ వేసి బాధ్యులను శిక్షించాలని కోరారు. ఇలాంటి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ, ఫ్యాప్టో జిల్లా చైర్మన్ శ్రీనివాసులు, కార్యదర్శి వెంకటనారాయణరెడ్డి, గౌరవాధ్యక్షులు లక్ష్మీనారాయణ, ఎస్ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు ఆదిశేషయ్య, ఎన్టీఏ నాయకులు గోపాలప్ప, ఇతర నేతలు ప్రభాకర్, నరసింహారెడ్డి, నాగరాజు, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల భద్రతకు

ప్రాధాన్యం

ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటును పరిశీలిస్తాం

రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

అనంతపురం టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్మికుల భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో జిల్లా అధికార యంత్రాంగంతో గురువారం సమావేశం నిర్వహించారు. జిల్లాలో పరిశ్రమలు, వాటి నిర్వాహకులు, కార్మికుల వివరాలను తెలుసుకున్నారు. పరిశ్రమలు, కార్మికులు తమ ప్రభుత్వానికి రెండు కళ్లు అని అన్నారు. పరిశ్రమలకు ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని అన్నారు. కార్మికుల భద్రత పట్ల యాజమాన్యాలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గడిచిన మూడేళ్లలో ప్రమాదం జరగని పరిశ్రలు ఉంటే.. వారు తీసుకుంటున్న భద్రతా చర్యలు గురించి నివేదిక తయారు చేసి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు సీఎం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని, కార్మికుల భద్రత, సంక్షేమం, ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెడుతోందని అన్నారు. అనంతపురం జిల్లాపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక ప్రేమ ఉందని అన్నారు. కియ పరిశ్రమను జిల్లాకు తీసుకురావడం గర్వకారణమని అన్నారు. తమ శాఖ ద్వారా పరిశ్రమల యాజమాన్యాలకు ఎంత చేయగలమో అంతకన్నా ఎక్కువ చేయడానికి సిద్ధంగా ఉన్నామని, అయితే కార్మికులకు చట్టాల ద్వారా అందాల్సిన ప్రయోజనాలు అందించాలని సూచించారు. కర్మాగారాలలో ప్రమాదాల నివారణకు రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా వసుధా మిత్రా కమిటీని ఏర్పాటు చేశారని అన్నారు.

ఈ కమిటీ రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలను పరిశీలించి, ప్రభుత్వానికి నివేదిక అందజేస్తుందని అన్నారు. జిల్లాలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి అవకాశాలను పరిశీలిస్తామని అన్నారు. నైపుణ్య శిక్షణ ఇచ్చి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అన్నారు. ప్రమాదాల నివారణకు కలెక్టరు నేతృత్వంలో జిల్లాస్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రమాద బాధితులకు ఈ కమిటీ అన్నివిధాలుగా సహకారం అందిస్తుందని అన్నారు. తన పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే తనకు లేదా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణ శర్మ, ఇన్‌చార్జి డీఆర్వో తిప్పేనాయక్, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కేశవులు, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా పేరెంట్స్ డే

జేసీ శివనారాయణశర్మ



వివరాలను వెల్లడిస్తున్న జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ డే వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహిస్తామని జేసీ శివనారాయణశర్మ తెలిపారు. డీఈఓ ప్రసాద్‌బాబుతో కలిసి ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 1,740 ప్రభుత్వ పాఠశాలలలో శనివారం పేరెంట్స్ డే నిర్వహిస్తామని అన్నారు. మొత్తం 2.06 లక్షల మంది విద్యార్థుల సమగ్ర ప్రగతి పత్రాలను అందజేస్తామని తెలిపారు. ఇప్పటికే హెచ్‌పీసీ కార్డులను పంపించామని, ఉపాధ్యాయులు పిల్లల ప్రగతి, మార్కులతో పూరించి తల్లిదండ్రుల సమక్షంలో పిల్లలకు అందజేస్తారని అన్నారు. ఈ వేడుకల నిర్వహణకు అన్ని పాఠశాలలకు కలిపి రూ.43 లక్షలు అందజేశామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పండుగ వాతావరణంలో వేడుకలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులను ఈ వేడుకలకు ఆహ్వానించాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు ఒక్కొక్కరు ఒక పాఠశాలకు తప్పనిసరిగా వెళ్లాలని కోరారు. ఎక్కడా వివాదాలు లేకుండా నిర్వహించాలని, సమస్యాత్మక ప్రాంతాలలో ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాజకీయాలకు అతీతంగా ఇలాంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అందరూ సహకరించాలని కోరారు.

పిచ్చి మొక్కలు.. కంప చెట్లు

మరమ్మతులకు నోచుకోని బీటీపీ ఎడమ కాలువ

ప్రశ్నార్థకంగా సాగు నీటి పారుదల

విడుదల కోసం రైతుల ఎదురుచూపు

గుమ్మఘట్ట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బీటీపీ ఎడమ కాలువ పరిధిలో డిస్ట్రిబ్యూటరీలు, ప్రధాన కాలువ మరమ్మతులకు నోచుకోకపోవడంతో పిచ్చి మొక్కలు, కంప చెట్లు పెరిగిపోయాయి. ఇప్పటిదాకా ఇరిగేషన్ అధికారులు కాలువ మరమ్మతులపై దృష్టి సారించకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టులలో ఒక్కటైన బీటీపీ(భైరవాన్‌తిప్ప ప్రాజెక్టు)లోకి నెల కిందటే పూర్తిస్థాయిలో నీరు(నీటి మట్టం 1654.5 అడుగులు) చేరింది. రబీ పంట సాగుకు డిసెంబరు రెండో వారంలో సాగునీరు విడుదల చేస్తే ఆయకట్టులో పంటలు సాగు చేసుకునేందుకు అనువుగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. కానీ మొదటి వారం ముగుస్తున్నా ఇప్పటిదాకా ఎడమ కాలువ మరమ్మతులు చేపట్టకపోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు నాలుగేళ్లకు ఓ సారి ప్రాజెక్టు నిండుతుండటంతో రొటేషన్ పద్ధతి ద్వారా కుడి, ఎడమ కాలువలకు సాగునీరు విడుదల చేస్తున్నారు. కుడికాలువ పరిధిలో నాలుగు వేలు, ఎడమకాలువ పరిధిలో 8 వేలు మొత్తం బీటీపీ ఆయకట్టు 12 వేల ఎకరాలు ఉంది.





గోనబావి వద్ద ముళ్లకంపలతో ఉన్న బీటీపీ ఎడమ కాలువ

సాధారణంగా ఆయకట్టుకు నీటి విడుదల సమయంలో కుడి, ఎడమ కాలువల పరిధిలోని రైతులతో సమావేశం ఏర్పాటు చేయాలి. ఎంత మేర నీరు విడుదల చేస్తున్నది, ఎప్పటి వరకు చేసేది రైతులకు తెలపాలి. ఈ ఏడాది ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నా సమావేశం ఏర్పాటు చేయకపోవడం పట్ల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన సమాచారం లేకపోవడంతో పంట సాగుకు పొలాలను సిద్ధం చేసుకోలేకపోతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా పంటలు సాగు చేయకపోవడంతో ఆయకట్టు భూముల్లో కంప చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. వాటిని తొలగించేందుకు సైతం ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. ఇరిగేషన్ అధికారులు ముందస్తుగా సాగునీటి విడుదల తేదీలను ఖరారు చేసి కాలువల మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

రెండురోజుల్లో కాలువ పనులు ప్రారంభిస్తాం

బీటీ ప్రాజెక్టు ఎడమ కాలువ మరమ్మతు పనులను రెండురోజుల్లో ప్రారంభించి సాగునీటి విడుదలకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం రూ. 23 లక్షలు నిధులు మంజూరు చేసింది. రైతులకు సకాలంలో సాగునీటిని అందిస్తాం.

- సాయిరాం, ఏఈ, బీటీ ప్రాజెక్టు

కాలువల్లో కంపచెట్ల పెరిగాయి



బీటీ ప్రాజెక్టులోకి వరదనీరు చేరి రెండునెలలు గడుస్తోంది. ఎడమ కాలువలో కంప చెట్లు పెరిగిపోయి సాగునీరు ముందుకెళ్ల లేని పరిస్థితి నెలకొంది. అధికారులు వెంటనే కంపచెట్లు, పిచ్చిమొక్కలు తొలగించి మరమ్మతులు చేపట్టాలి.

- చెంగారెడ్డి, రైతు, గోనబావి

అధికారుల అలసత్వం



బీటీపీ ఎడమ కాలువ పరిధిలో సాగునీరు అందించే సమయంలో అధికారులు ప్రతి ఏటా అలసత్వం వహిస్తూ ఉన్నారు. ముందస్తుగా కాలువల మరమ్మతులు చేపట్టి వారం రోజుల్లో నీరు విడుదల చేయాలి.

- వెంకటేశులు, రైతు, కలుగోడు

చివరి ఆయకట్టుకు సాగునీరు అందించండి



ఎడమ కాలువ పరిధిలోని చివరి ఆయకట్టు భూములకు సకాలంలో సాగునీరు అందించేందుకు కృషి చేయాలి. సాగునీటి విడుదలలో జాప్యం జరిగితే చివరి ఆయకట్టు భూముల్లో పంటలు పండిచుకోవడం కష్టమవుతుంది.

- రామాంజినేయులు, ఆయకట్టు రైతు, కలుగోడు



నారాయణపురం చెక్ డ్యాం సమీపంలో ఇళ్లు లేని ప్రాంతంలో నిర్మించిన సీసీ రోడ్డు

హవ్వ.. నాలుగు ఇళ్లకే..!

అనంతపురం రూరల్ మండలంలోని ఎ.నారాయణపురం పంచాయతీలో ఓ సీసీ రోడ్డు నిర్మాణం అధికారుల తీరుకు అద్దం పట్టేలా ఉంది. నారాయణపురం చెక్ డ్యాం సమీపంలో ఇటీవల సీసీ రోడ్డును నిర్మించారు. దీనికి రూ.25 లక్షల ఉపాధి పథకం నిధులను వెచ్చించారు. అర కిలో మీటరు పొడవున నిర్మించిన ఈ దారి.. కేవలం నాలుగు కుటుంబాల కోసం కావడం చర్చనీయాంశం అయింది. సాధారణంగా పనుల ఎంపికలో ప్రాధాన్యాలను పాటిస్తారు. ఒక్కోసారి అధికార పక్షం నాయకుల జోక్యంతో కాస్త అటూ ఇటుగా పనుల ఎంపిక జరుగుతుంది. కానీ ఇక్కడ విపక్షానికి చెందినవారే ఉన్నారు. పోనీ.. మిగిలిన కాలనీలలో రోడ్ల నిర్మాణం పూర్తి అయింది.. ఇంక నిర్మించాల్సింది ఈ ఒక్కచోటే అన్నా ఓ అర్థం ఉంటుంది. చాలా కాలనీలలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వందల కుటుంబాలు జీవనం సాగించేచోట అభివృద్ధి పనులు చేయకుండా.. నాలుగు కుటుంబాలు ఉండే చోట ఏకంగా రూ.25 లక్షలతో రోడ్డును నిర్మించడం విమర్శలకు తావిస్తోంది. అధికారులు నిబంధనలు ఏమాత్రం పాటించలేదని, ఎవరి ప్రమేయంతో ఈ నిర్ణయం తీసుకున్నారని పంచాయతీ ప్రజలు నిలదీస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం రూరల్



వ్యర్థం.. అనర్థం

ఇంటింటి చెత్తను
మోసుకెళ్లే వ్యర్థాల నదిలో..
నీ వేట..
ఎంతటి అనర్థమో తెలుసా..?
ప్లాస్టిక్ బాటిళ్లు
ఖాళీ మద్యం సీసాలు
కవర్లు.. పాడైన వస్తువులు
కాస్త ఓపికగా
పారిశుధ్య కార్మికులకు
ఇవ్వలేని జనం నడుమ
పొట్టకూటి కోసం పోరాడే
పేద మనిషీ..!
ప్రకృతిపరంగా నువ్వు..
ఓ పర్యావరణవేత్తవు తెలుసా..!

(అనంతపురం నగరంలోని గౌరీ కాంప్లెక్స్ వెనుకభాగంలో.. మరువ వంకలో పేదోడి జీవన పోరాటం)





క్రీడా వికాసమేదీ..!

• మరుగునపడ్డ క్రీడాసామగ్రి • నిరుపయోగంగా రన్నింగ్ ట్రాక్ • ఇబ్బందుల్లో క్రీడాకారులు • సౌకర్యాలు కల్పించాలని వినతి

" గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించి వారి నైపుణ్యాన్ని దేశ, రాష్ట్ర స్థాయికి వెళ్లేందుకు తీర్చిదిద్దాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన క్రీడా వికాస కేంద్రాలు నేడు దయనీయంగా మారాయి. 5.11 ఎకరాల్లో ఇండోర్ స్టేడియం, పెవలియన్ భవనం, 200 మీటర్ల పరుగు పందెం కోర్ట్ తదితర వాటిని నిర్మించారు. అయితే వాటి నిర్వహణకు వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అయినా స్పందించి.. నిధులు విడుదల చేసి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. - పెనుకొండ టౌన్ (ఆంధ్రజ్యోతి) "

నిరుపయోగంగా ఉన్న క్రీడా వికాస కేంద్రం





పిచ్చిమొక్కలతో నిండిన 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్



తుప్పుపట్టిన జిమ్ సామగ్రి



వైసీపీ హయాంలో క్రీడావికాస కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు (ఫైల్)

ఆర్భాటంగా ప్రారంభం

2014 టీడీపీ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నియోజకవర్గానికి ఓ క్రీడా వికాస కేంద్రాన్ని అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేయడానికి పూనుకున్నారు. ఈ క్రమంలో పెనుకొండలో ఆ కేంద్ర నిర్మాణాన్ని పూర్తి చేశారు. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం రావడంతో 2019 నవంబరు12న నాటి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన క్రీడల సంక్షేమశాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసులు, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి శంకర్‌నారాయణ పూర్తయిన ఆ స్టేడియానికి వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంగా పేరు మార్చి ఆర్భాటంగా ప్రారంభించారు. ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో ఆ కేంద్రాల నిర్వహణ గురించి ఏ మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ క్రీడావికాసానికి ఒక్క రూపాయి కూడా నిధులు ఖర్చుపెట్టకపోవడం శోచనీయం.



మరుగున పడ్డ టెన్నిస్ కోర్టు మెష్

రూ.2.10 కోట్లతో నిర్మాణం

పెనుకొండ పట్టణంలోని పరిటాల డిగ్రీ కళాశాలలో 5.11 ఎకరాల్లో అప్పటి టీడీపీ ప్రభుత్వం స్పోర్ట్స్ అథారిటి నిధులు రూ.2.10కోట్లు ఖర్చు చేసి ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేశారు. అందులో షెటిల్ కోట్, జిమ్, టేబుల్ టెన్నిస్, అందులో క్రీడాకారులకు డార్మెంటరి గదులు నిర్మించారు. అలాగే పెవిలియన్ భవనం 200మీటర్ల పరుగు పందెం కోర్టును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఒక షెటిల్‌కోట్ తప్ప మిగిలిన వన్ని నిరుపయోగంగా ఉన్నాయి. జిమ్ పరికరాలు తుప్పుపట్టి మూలానపడ్డాయి.

సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

సత్యసాయిజిల్లాలో మడకశిర రెండు, పెనుకొండ, రామగిరి, ధర్మవరంలో ఒక్కో క్రీడా వికాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఖేల్ ఇండియాలో భాగంగా సెంట్రల్ స్కీంను సద్వినియోగం చేసుకుంటున్నాం. గత ఐదేళ్లలో ఆడదాం ఆంధ్ర మాత్రమే జరిగింది. వికాశ కేంద్రాలన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. సమస్యను ఉన్నతాధికారులకు వివరించాం.

- ఉదయ్‌భాస్కర్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి

సౌకర్యాలు లేవు



పెనుకొండలో పలు క్రీడల్లో రాణించే సత్తా ఉన్నా యువతీ యువ కులు ఉన్నారు. ఒక్క షెటిల్‌కోర్ట్ మినహా ఏ సౌకర్యాలు లేవు. షెటిల్‌కోర్ట్ కూడా సొంత ఖర్చుతో క్రీడాకారులు బాగుచేసుకున్నారు. పెనుకొండ ఎమ్మెల్యే, మంత్రి సవిత క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా చర్యలు చూపి ఈ క్రీడావికాస కేంద్రానికి పూర్వవైభవం తీసుకురావాలి. క్రీడాకారులు సత్తాచాటి రాష్ట్ర, దేశ క్రీడల్లో రాణిస్తారు.

- కమలాకర్, టెన్నిస్ క్రీడాకారుడు, పెనుకొండ

నిరుపయోగంగా పరికరాలు



ఒక్క బ్యాడ్మిటన్ కోర్టు మాత్రం ఉంది. మిగిలిన జిమ్, టేబుల్ టెన్నీస్, రన్నింగ్ కోర్ట్ ముళ్ల పొదలమయం అయ్యాయి. టెన్నీస్‌కోర్ట్ పూర్తీ నిరుపయోగంగా మారింది. ప్రజాప్రతినిదులు దృష్టిసారించి సౌకర్యాలు కల్పిస్తే పెనుకొండ క్రీడాకారులు సత్తాచాటుతారు. చుట్టూ కాంపౌండ్ లేక అసౌకర్యంగా మారింది.

- రిజ్వాన్, బ్యాడ్మింటన్ కోచ్

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా



5.11ఎకరాల్లో నిర్మించిన ఈ క్రీడా వికాస్ కేంద్రం చుట్టూ ప్రహరీ లేక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాత్రివేళల్లో మందు బాబులు వస్తుంటారు. చుట్టూ కాంపౌండ్ నిర్మించి క్రీడావికాస కేంద్రంలో 200మీటర్ల రన్నింగ్ కోర్టు, జిమ్‌సామగ్రి, టేబుల్ టెన్నీస్ కోర్టు నిర్మించాలి. -ఖాజా, క్రీడాకారుడు

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక

సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వేణుమాధవ్



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. పాలిటెక్ ఫెస్ట్-2024 రీజనల్ స్థాయిలో అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 17 కళాశాలల విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిలో ఎంపికైన ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి ఫెస్ట్‌లో ప్రదర్శిస్తారని సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వేణుమాధవ్ పేర్కొన్నారు. రెండు రోజులపాటు నిర్వహించిన ఫెస్ట్ గురువారం ముగిసింది. ఇందులో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను జేఎన్‌టీయూ ఈఈఈ బ్రాంచ్ అసోసియేట్ ప్రొఫెసర్ రామశేఖర్‌రెడ్డితోపాటు కియ సంస్థ ప్రతినిధులు పరిశీలించారు. గుంతకల్లు కళాశాల విద్యార్థుల పవర్ సిగ్నలింగ్ సిస్టం, రాయదుర్గం కళాశాల విద్యార్థుల ఆర్గానిక్ లోడ్ క్యారింగ్ ఎయిడ్ ఫర్ లేబర్ వర్క్ అనే అంశాలపై రూపొందించిన ప్రాజెక్టులు ప్రథమ, ద్వితీయ బహుమతులకు ఎంపికైనట్లు న్యాయనిర్ణేతలు తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లును అందజేశారు.

అర్ధంతరంగా ఆగిన గోడౌన్ నిర్మాణం



శ్రీధరఘట్టలో ఆగిన సొసైటీ గోడౌన్ పనులు

బొమ్మనహాళ్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పండిన పంటలను నిల్వ ఉంచుకునేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సొసైటీ గోడౌన్ నిర్మాణాన్ని అర్ధంతరంగా ఆపేశారు. మండలంలోని శ్రీధరఘట్ట, ఉద్దేహాళ్ సహకార సంఘం సొసైటీలకు గోడౌన్లు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరయ్యాయి. వైసీపీ ప్రభుత్వంలో కొంతవరకు పనులు చేశారు. పూర్తయిన వాటిని సొసైటీలకు అప్పగించలేదు. శ్రీధరఘట్ట గ్రామంలో రూ. 82 లక్షలతో నిర్మిస్తున్న గోడౌన్‌ను అర్ధంతరంగా ఆపేశారు. దీంతో రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునే సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింగానహళ్లిలో నిర్మించిన గోడౌన్ పూర్తయినా కాంట్రాక్టర్ సొసైటీలకు అప్పగించలేదు. అర్ధంతరంగా ఆగిన గోడౌన్ పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

మహిళల అభివృద్ధికి

వంద రోజుల ప్రణాళిక

జీవనోపాధుల పెంపునకు ప్రాధాన్యం

డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య

ఇంటర్వ్యూ interview



అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళల అభివృద్ధే లక్ష్యంగా వంద రోజుల ప్రణాళికతో పనిచేస్తున్నామని డీఆర్‌డీఏ-వెలుగు అనంతపురం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఈశ్వరయ్య తెలిపారు. వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్న క్రమంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో పలు అంశాలను వెల్లడించారు.

ప్రశ్న: సంస్థాగత నిర్మాణం ఎలా చేస్తున్నారు...?

పీడీ: సంస్థాగత నిర్మాణం చాలా పటిష్టంగా ఉంటుంది. స్వయం సహాయక సంఘాలు, గ్రామైక్య సంఘం, మండల సమాఖ్య, జిల్లా సమాఖ్య ఉంటాయి. ఇందులో ఇతరుల జోక్యం ఉండదు. మొత్తం సంఘంలో ఉండే సభ్యులే సంస్థాగత నిర్మాణం చేపడతారు.జ

ప్రశ్న: జిల్లాలో ఎన్ని డ్వాక్రా సంఘాలున్నాయి..?

పీడీ: అనంతపురం జిల్లాలో 35,897 స్వయం సహాయక మహిళా సంఘాలు (డ్వాక్రా) ఉన్నాయి. ఇందులో 3,79,433 మంది సభ్యులు ఉన్నారు.

ప్రశ్న: ఏయే సామాజికవర్గాల్లో ఎంతమంది ఉన్నారు..?

పీడీ: జిల్లాలో ఎస్సీ కేటగిరిలో 5,799 సంఘాల్లో 75,037 మంది ఉండగా, ఎస్టీలు 1050 సంఘాల్లో 15,846 మంది, బీసీలలో 24,237 సంఘాలకుగాను 2,14,279 మంది, ఓసీలో 4016 సంఘాల్లో 61,644 మంది, మైనార్టీలలో 795 సంఘాల్లో 12,627 మంది సభ్యులు ఉన్నారు.

ప్రశ్న: మహిళల అభివృద్ధికి ఎలా పనిచేస్తున్నారు..?

పీడీ: వంద రోజుల ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. ప్రతి వంద రోజుల పురోగతిని సమీక్షించుకుని, వెనుకబడిన సబ్జెక్టులపై లోతుగా పరిశీలించి మరింత అభివృద్ధి సాధించేలా కృషి చేస్తున్నాం.

ప్రశ్న: మహిళల కోసం ఏ పథకాలు అమలు చేస్తున్నారు?

పీడీ: గతంలోకంటే ఈ ఏడాదిలో మరిన్ని పథకాలు తీసుకువచ్చాం. ఇందులో పించన్‌తో పాటు బ్యాంకు లింకేజీ (రుణాలు), ఉమెన్ లెడ్ ఎంటర్‌ప్రైజెస్, సీడ్ క్యాపిటల్, హయ్యర్ ఆర్డర్ ఎంటర్‌ప్రైజెస్, ఉన్నతి, స్త్రీనిధి, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన, చేయూత మహిళా మార్టులు, స్వీప్ అంబ్రెల్లా ప్రాజెక్ట్, ఎస్టీ మహిళలకు ప్రత్యేకంగా పెరటికోళ్ల పెంపకం పథకాలు అమలు చేస్తున్నాం.

ప్రశ్న: పురోగతిని ఎలా అంచనా వేస్తారు...?

పీడీ: జిల్లాలో ఉన్న స్వయం సహాయక సంఘాలకు గ్రేడింగ్ ద్వారా పురోగతిని గుర్తిస్తాం. ఏ గ్రేడ్‌లో 31,815 సంఘాలు, బీ గ్రేడ్‌లో 4082 సంఘాలు ఉన్నాయి. బీ గ్రేడ్‌లో ఉన్న సంఘాలను ఏ గ్రేడ్‌లోకి తీసుకురావడమే పురోగతి సాధించడం.

ప్రశ్న: ఇప్పటి వరకు ఎంత మందికి, ఎంత రుణాలు ఇచ్చారు?

పీడీ: బ్యాంకు లింకేజీ కింద ఈ ఏడాదిలో 25,798 మంది సభ్యులకు రూ.1239 కోట్లు లక్ష్యంగా కాగా 8,345 మందికి రూ.670 కోట్లు చెల్లించాం. ఉన్నతి కింద 2,415 మందికి రూ.12.45 కోట్లు లక్ష్యంగా ఉండగా...2,307 మందికి రూ.11.75 కోట్లు చెల్లించాం. స్త్రీనిధి కింద 32,400 మంది సభ్యులకు రూ.162 కోట్లు లక్ష్యానికి గాను ఇప్పటి వరకు 12,200 మందికి రూ.96.70 కోట్లు చెల్లించాం. నార్పలలో మహిళామార్టు ద్వారా అభివృద్ధి వైపు నడుస్తున్నారు.

భూసమస్యల పరిష్కారానికి అడుగులు

- ప్రజల వద్దకే అధికారులు
- ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల నమోదు
- నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

అనంతపురం టౌన్/ధర్మవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అనేక సంవత్సరాలుగా గ్రామాల్లో భూములకు సంబంధించిన సమస్యలతో రైతులు సతమతమవుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భూసమస్యలు మరింత అధికమయ్యాయి. జగనన్న భూ హక్కు... భూ రక్ష పేరిట చేపట్టిన రీ సర్వే లోపభూయిష్టంగా జరిగింది. ఈ సర్వే రైతులకు కొత్త సమస్యలను తెచ్చిపెట్టింది. పాసు పుస్తకాల్లో అచ్చుతప్పులు, భూ విస్తీర్ణంలో తేడాలు, ఒకరి సర్వే నెంబరు మరొకరికి కేటాయింపు, జాయింట్ ఎల్‌పీఎం తదితర సమస్యలు వెలుగుచూశాయి. వీటిని పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులకు సిద్ధమైంది. తహసీల్దార్‌తో పాటు ఆర్ఐ, సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారి, మండల సర్వేయర్, దేవదాయ, రిజిస్ట్రేషన్, అటవీశాఖ ఇతర శాఖల సిబ్బంది హాజరు కానున్నారు. జిల్లా నోడల్ అధికారి, నియోజకవర్గ నోడల్ అధికారులు, మండలాలకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. ఆర్ఓఆర్, 1బీ, అడంగళ్‌తో పాటు ప్రభుత్వ భూమి రిజిస్టర్ కాపీలు, వెబ్‌ల్యాండ్ నుంచి ముద్రించిన పత్రాలను ఈ సదస్సుల్లో ప్రదర్శిస్తారు. భూ సమస్యలపై రైతులు అందించే అర్జీలను అధికారులు పరిశీలించి వెంటనే వాటికి సంబంధించిన రసీదులను అందిస్తారు. ఆన్‌లైన్‌లో అన్ని ఫిర్యాదులు నమోదు చేస్తారు. క్షేత్రస్థాయిలలో భూములను పరిశీలించి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తారు. శుక్రవారం నుంచి జనవరి 8వతేదీ వరకు ఈ సదస్సులు కొనసాగుతాయి. ఈ మేరకు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఉన్నతాధికారులు ఆ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి సన్నద్ధం చేశారు. ఆయా గ్రామాలకు సంబంధించిన మొత్తం రెవెన్యూ రికార్డులను అందుబాటులో ఉంచుకొని ప్రజలు ఇచ్చే ఫిర్యాదు మేరకు పరిశీలించి వాస్తవాలు చెప్పి పరిష్కారం చూపాల్సి ఉంటుంది. ఒక వేళ సమస్యగా ఉంటే 45 రోజుల్లో వాటిని పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది.

భూ సమస్యలను పరిష్కరించాలి: సీపీఎం

అనంతపురం కల్చరల్: రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ గురువారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు ఇచ్చిన ప్రతి రైతుకు రసీదు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా గతంలో అమలు కాలేదన్నారు. గతంలో వచ్చిన అర్జీలను తక్షణం పరిష్కరించాలన్నారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో రికార్డులు ఆన్‌లైన్‌లో ఉంచాల పేర్కొన్నారు. రికార్డులు ఆన్‌లైన్‌లో పెట్టకపోయినా కబ్జాలు పెరిగిపోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు.



భూ రీసర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులు

భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే అధికారులు, ప్రజాప్రతినిధులకు ఈ సదస్సులపై అవగాహన కల్పించాం. సదస్సులు నిర్వహించే గ్రామాల్లో ముందుగానే దండోరా వేయిస్తాం. ప్రజలు సమస్యలను తెలిపితే అక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ఏదైనా ఇబ్బంది ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి 45 రోజుల్లో దానికి సమాధానం చూపుతాం. -శివనారాయణశర్మ, జేసీ, అనంతపురం జిల్లా



అధికారులు. ప్రజాప్రతినిధులతో చర్చిస్తున్న అనంతపురం జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ తదితరులు

అన్ని గ్రామాల్లో సదస్సులు

జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తాం. ఎస్సీ, ఎస్టీ నివాసాలతో సహా రెవెన్యూ గ్రామాల్లో తిరిగి గ్రామసభలు నిర్వహించాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం. భూ యజమానుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారు. వాటికి వెంటనే రసీదు ఇస్తారు. క్షేత్ర సందర్శనతో సహా ప్రతి ఫిర్యాదును సమగ్రంగా విచారించి పరిష్కరించాలి. ముఖ్యంగా హైకోర్టు కేసులను గుర్తించడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని రెవెన్యూ అధికారులకు సూచనలు ఇచ్చాం.

- టీఎస్ చేతన్, కలెక్టర్, శ్రీసత్యసాయి జిల్లా



గుంతను తవ్వి వదిలేశారు..!



బొమ్మనహాళ్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపురం క్యాంప్ వద్ద బళ్లారి-కళ్యాణదుర్గం రోడ్డు పక్కన గుంతను తీశారు. పని జరిగిన తర్వాత గుంతను పూడ్చకుండా అలాగే వదిలేశారు. శ్రీరాంరెడ్డి తాగునీటి పైపులైను పగిలిపోవడంతో మరమ్మతులు చేసేందుకు ఎక్స్‌కవేటర్ ద్వారా గుంత తీశారు. పనులు పూర్తి చేశారు గానీ గుంతను వదిలేశారు. రోడ్డు పక్కనే ఇలా గుంతను వదిలేసి ప్రమాదాలకు దారితీస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే హడావుడి చేసే అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడం లేదని విమర్శిస్తున్నారు.

ఊళ్లు కడతామని బీళ్లుగా మార్చారు..!



బొమ్మనహాళ్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో పేదల లే అవుట్లపై ప్రదర్శించిన నిర్లక్ష్యానికి సాక్ష్యంగా మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో వేసిన లే అవుట్లు నిలుస్తున్నాయి. ఊళ్లు కడుతున్నామని ఊదరగొట్టిన నాటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చివరకు ఆ లే అవుట్లను బీళ్లుగానే వదిలేశారు. పొలాల మధ్యలో లే అవుట్లు వేయడంతో నేటికీ అక్కడకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఉద్దేహాళ్ గ్రామంలో తిమ్మలాపురం రోడ్డుకు లేఅవుట్లు వేశారు. 90 మందికి పైగా పట్టాలు ఇచ్చారు. ఒక్క ఇల్లు కూడా కట్టించలేదు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.

జడ్పీలో కారుణ్య నియామకాలు



నియామక ఉత్తర్వులు ఇస్తున్న చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ వెంకటసుబ్బయ్య

అనంతపురం విద్య, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, జిల్లా పరిషత్, మండల పరిషత్‌కు సంబంధించి వివిధ కార్యాలయాల్లో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబికులు కారుణ్య నియామకం కింద 12 మందికి ఉత్తర్వులిచ్చారు. గురువారం జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ చాంబర్‌లో సీఈఓ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో అర్హులైన అభ్యర్థులు 12 మందికి నియామక ఉత్తర్వులు అందజేశారు. అభ్యర్థులు నందిని, బాలాజీ, ముజఫర్ సుల్తానా, హేమంత్, ఉమా, ఉమేష్‌కుమార్, తిప్పేస్వామి, ప్రసాద్, నిరోషా వ్యాస్, సుజాతమ్మ, షెక్షా, శోభారాణికి ఆఫీస్ సబార్డినేటర్లుగా ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ నియామక ఉత్తర్వులు పొందిన ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ ప్రారంభం

జిల్లా పరిషత్ ఆవరణలో డీపీఆర్సీ సమావేశ మందిరంలో స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అంశంపై రెండు రోజుల శిక్షణ ప్రారంభమైంది. జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ వెంకటసుబ్బయ్య శిక్షణను ప్రారంభించారు. జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజాసేవలో ఉండే ఉద్యోగులు నిత్యం తమ విజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు పెంచుకోవాలని సూచించారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీలు, పంచాతీయ కార్యదర్శులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్

913 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు గురువారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 913 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ -2కు 819 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.33

అనంతపురం రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.33తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.23, కనిష్ఠ ధర రూ. 13 పలికినట్లు తెలిపారు.

చీనీ టన్ను రూ. 31వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 31,190 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ. 16వేలుతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 27 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

వ్యాపార నిర్వహణపై శిక్షణ

అనంతపురంరూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనేజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 12 వరకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు వ్యాపార నిర్వహణ శక్తి సామర్థ్యాలపై ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాపరెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యాలయంలో మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. శిక్షణకు ఆసక్తిగల అభ్యర్థులు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు వ్యాపార నిర్వహణ శక్తి సామర్థ్యాలు, మెలకువలు, వ్యాపారానికి కావాల్సిన విధివిధానాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. అనంతరం సర్టిఫికేట్ ఇస్తారని పేర్కొన్నారు. 18 నుంచి 45ఏళ్లలోపు వారు ఇందుకు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 8317520929, 08554-281026 సంప్రదించాలన్నారు.

8, 9, 11 విద్యార్థులకు నేషనల్ ఒలింపియాడ్ పరీక్షలు

అనంతపురం విద్య, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): భారత వాతావరణ శాఖ దేశవ్యాప్తంగా 8,9,11 తరగతుల విద్యార్థులకు నేషనల్ ఒలింపియాడ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత వాతావరణ శాఖ ఏర్పడి 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వాతావరణం, పర్యావరణం అన్న అంశాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడానికి ఆన్‌లైన్ పోటీ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈనెల 10వ తేదీ వరకూ విద్యార్థులు తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఈనెల 14,15 తేదీల్లో రాష్ట్రస్థాయిలో ఆన్‌లైన్ పోటీ పరీక్షలు ఉంటాయన్నారు. ఈనెల 17న ఫలితాలు విడుదల చేస్తారని, జనవరి 14న జాతీయ స్థాయి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. విజేతలకు జనవరి 15న అవార్డులు అందజేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు http://mausam.imd.gov.in/met-oly/ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

కమిటీ ఎంపిక

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీని ప్రకటించింది. పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి జాబితాను ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా ఆరుగురికి స్థానం కల్పించారు. ఉరవకొండకు చెందిన ప్రసాద్, కళ్యాణదుర్గానికి చెందిన ఈరన్న, అనంతపురానికి చెందిన శంకర్‌యాదవ్, రాయదుర్గానికి చెందిన నాగరాజు, గుంతకల్లుకు చెందిన రహంతుల్లా, లక్షీనారాయణ యాదవ్‌కు ఉన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శులుగా ఐదుగురికి చోటు కల్పించారు. ఉరవకొండకు చెందిన శీన, యోగిందర్‌రెడ్డి, గుంతకల్లుకు చెందిన ఖాదర్‌వలి, మల్లికార్జున, అనంతపురానికి చెందిన ఇమామ్‌వలీకి స్థానం కల్పించారు. జిల్లా కార్యదర్శులుగా మరో ఐదుగురిని నియమించారు. గుంతకల్లుకు చెందిన మహేంద్ర, ఆలం నవాజ్, ఉరవకొండకు చెందిన శీన, శ్రీరాములునాయక్, అనంతపురానికి చెందిన హరిరాయల్‌ను ఉన్నారు.

జ్వరంతో చిన్నారి మృతి

డి.హీరేహళ్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మడేనహళ్లి గ్రామానికి చెందిన చిన్నారి దిలీప్(4) గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గంగన్న, లక్ష్మక్క కుమారుడు దిలీప్‌కు ఐదు రోజుల క్రితం జ్వరం రావడంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు వచ్చారు. ఇక్కడ వైద్యులు రక్తపరీక్షలు నిర్వహించి తగిన మందులు ఇచ్చి ఇంటికి పంపించారు. రెండు రోజుల తర్వాత మళ్లీ జ్వరం రావడంతో కుటుంబసభ్యులు ఆ పిల్లవాడిని బళ్లారిలోని విమ్స్‌కు తీసుకెళ్లి చికిత్సలు అందించారు. ఆరోగ్యం క్షీణించడంతో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు.

బడిలో గొడవలు..!

- కట్టుతప్పుతున్న విద్యార్థులు
- చదువు మానేసి కొట్లాటలు
- ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్న వైనం
- ప్రభుత్వ పాఠశాలల్లోనే వెలుగులోకి..
- ప్రైవేటులో దుప్పటి పంచాయితీలతో సరి



హిందూపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బంగారు భవిష్యత్తు ఉన్న విద్యార్థులు కొన్నిచోట్ల చదువులు మానేసి, పాఠశాల గదుల్లోనే కొట్టుకుంటున్నారు. తమ పిల్లలు చదువుకోవాలని తల్లిదండ్రులు బడికి పంపిస్తే కొంతమంది వ్యసనాలకు బానిసలుగా మారి, మరికొంతమంది స్నేహితుల మాటలు విని గొడవలు, దాడులకు దిగుతున్నారు. ఇటీవలిగా జరుగుతున్న ఘటనలను చూస్తే వారి భవిష్యత్తు ఎలా ఉంటుందోనన్న భయం కలగకమానదు. విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలు, బస్టాపుల వద్ద ఇటీవల చేస్తున్న పనులు నివ్వెరపరిచేలా ఉన్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లోనే..

విద్యార్థుల మధ్యగానీ, ఉపాధ్యాయులతోగానీ ఘర్షణ తలెత్తితే కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే వెలుగులోకి వస్తున్నాయి. అదే ప్రైవేటులో అయితే సదరు యాజమాన్యం దుప్పటి పంచాయితీతో కప్పిపుచ్చుతోంది. హిందూపురం ప్రాంతంలోని ప్రైవేటు విద్యాలయాల్లో విద్యార్థుల మధ్య ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య చాలా గొడవలు జరిగాయి. వీటిపై విద్యాశాఖగానీ, పోలీసులుగానీ పెద్దగా దృష్టిపెట్టిన దాఖలాల్లేవు. అదే ప్రభుత్వ పాఠశాల, కళాశాల అయితే ఆగమేఘాలమీద చర్యలు తీసుకుంటారు. ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు.. సదరు అధికారులను సద్దుబాటు చేయగలరు. దీంతో సదరు అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. విద్యాలయాల్లో విద్యార్థుల కొట్లాటలు సమాజానికి చేటేతప్ప.. మంచిదికాదు. చదువుకోవాల్సిన వయసులో, విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన సమయంలో గొడవలకుపోయి విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

> గత నెలలో పుట్టపర్తిలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్న హిందూపురానికి చెందిన విద్యార్థిని తోటివారు చితకబాదారు. సదరు విద్యార్థి హిందూపురానికి వచ్చేశాడు. రెండ్రోజుల తర్వాత మృతిచెందాడు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన తెలిపారు. రెండు ప్రభుత్వ శాఖల అధికారులు.. కళాశాల యాజమాన్యంతో కలిసి దుప్పటి పంచాయితీచేసి కథ సుఖాంతం చేశారు.

> ఏడాది క్రితం హిందూపురం మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఆటలాడుకుంటూ క్రికెట్ వికెట్లతో కొట్టుకున్నారు. దీంతో నలుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ పంచాయితీ పోలీసు స్టేషన్‌కు చేరింది. ఇరువైపులా విద్యార్థులే ఉండటంతో వారి భవిష్యత్తుకు ఇబ్బంది అవుతుందని రాజీచేసి పంపించేశారు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఇలాంటివి జిల్లాలో కోకొల్లలు జరిగాయి. వెలుగులోకి వచ్చేవి కొన్నే.

> హిందూపురం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో కొన్నిరోజుల క్రితం ఇద్దరు విద్యార్థులు తమాషాగా ఆడుకుంటూ రబ్బర్ బ్యాండ్‌తో మరో విద్యార్థిని కొట్టారు. ఆ రబ్బర్ బ్యాండ్ వేరే విద్యార్థికి తగిలింది. దీంతో అక్కడే ఉన్న చిలమత్తూరుకు చెందిన విద్యార్థి మొహంపై కొట్టడంతో కళ్లజోడు పగిలి కంటిలో గుచ్చుకున్నాయి. దీంతో సదరు విద్యార్థికి బెంగళూరులో చికిత్సలు అందించారు. శస్త్రచికిత్సలు చేసిన వైద్యులు ఆరునెలలపాటు కంటిచూపుపై హామీ ఇవ్వలేమని చెప్పారు. దీంతో బాధిత విద్యార్థి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు.

> పురంలోని మరో ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు మేడపై తగాదాపడి ఒకరినొకరు తోసుకున్నారు. ఓ విద్యార్థి కిందపడి, తీవ్రగాయాలయ్యాయి. గుట్టు చప్పుడు కాకుండా ప్రైవేటు ఆస్పత్రిలో చూపించి ఇంటికి పంపించారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు చెప్పగా... అందుకు పాఠశాల యాజమాన్యం ఒప్పుకోలేదు. ఫిర్యాదు చేస్తే విద్యార్థి భవిష్యత్తుకు ఇబ్బంది అవుతుందని చెప్పడంతో తల్లిదండ్రులు మిన్నకుండిపోయారు.

బాల్య వివాహాలు చేస్తే కేసులు

- ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

అనంతపురం విద్య, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి హెచ్చరించారు. గురువారం పీడీ మాట్లాడుతూ....అనంతపురం రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలికకు వివాహం చేస్తున్నారంటూ చైల్డ్‌లైన్‌కు రెండు రోజుల కిందట ఓ అజ్ఞాత వ్యక్తి నుంచి సమాచారం రావడంతో చైల్డ్‌లైన్, ఐసీడీఎస్ సిబ్బంది గ్రామానికి వెళ్లి ఆపివేశారన్నారు. మళ్లీ అజ్ఞాత వ్యక్తి చైల్డ్‌లైన్‌కు ఫోన్ చేసి.. అధికారులు ఆపిన పెళ్లిని మళ్లీ చేస్తున్నారని సమాచారం అందించారన్నారు. ఆ వెంటనే బాల్య వివాహయత్నాన్ని అడ్డుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. అయినప్పటికీ బుధవారం తెల్లవారుజామున గుట్టుచప్పుడుకాకుండా రాప్తాడు మండలంలోని ఓ శివాలయంలో బాల్య వివాహం చేసినట్లు సమాచారం వచ్చిందన్నారు. దీంతో చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ కృష్ణమాచారి, ఇతర సిబ్బంది, కేస్ వర్కర్ సుహాసిని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, జయశ్రీ, ఇతర అధికారులు రూరల్ సీఐ, రాప్తాడు సీఐ సహకారంతో బాలికను తీసుకొచ్చి, అందుకు బాధ్యులైన వారిపై కేసు నమోదు చేయించామని తెలిపారు. బాలికను బుధవారం రాత్రి బాలసదన్ సంరక్షణలో ఉంచి కౌన్సెలింగ్ అనంతరం ఆమె కోరిక మేరకు గురువారం ఆమె పిన్ని వద్దకు పంపామని తెలిపారు. బాలిక గతంలో చదివిన పాఠశాలలో తిరిగి చేర్పేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. బాల్య వివాహం చట్టారీత్యా నేరమని, ఎవరు చేసినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహం చేస్తే రెండేళ్ల జైలు, లక్ష రూపాయల జరిమానా ఉంటాయని తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

రాప్తాడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు, రాప్తాడు మండలం మరూరు గ్రామానికి చెందిన యువకుడితో వివాహం చేసిన ఘటనకు సంబంధించి ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు. గురువారం ఆయన విలేకరులకు తెలిపిన మేరకు.. బుధవారం బాలికకు, యువకుడికి మండలంలోని హంపాపురం గ్రామంలోని శివాలయంలో వివాహం జరిపించారు. ఈ విషయాన్ని స్థానికులు చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించారు. ఐసీడీఎస్ చైల్డ్‌లైన్ సిబ్బంది ఫిర్యాదు చేయడంతో బాలిక తల్లిదండ్రులు, యువకుడు, యువకుడి తల్లిదండ్రులపై కేసు నమోదు చేశామన్నారు.

స్కావెంజర్ చట్టాన్ని అమలు చేయాలి: జేసీ

అనంతపురం టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మ్యానువల్ స్కావెంజరు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. కార్మికులు తప్పనిసరిగా విధులకు హాజరు కావాలన్నారు. ఎవరైనా విధులకు హాజరుకాకపోతే చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో మ్యానువల్ స్కావెంజర్స్ ఉంటే గుర్తించాలన్నారు. పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపాలిటీలు, పంచాయతీల్లో సఫాయి కర్మచారులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. స్కావెంజరు కుటుంబాలకు ప్రభుత్వ పథకాల కింద అర్హత కలిగినవారికి రుణాలు ఇప్పించాలన్నారు. ఈ సందర్భంగా సభ్యులు కొందరు మాట్లాడుతూ ఇంటి, మురుగు కాలువలు, రైల్వే ట్రాక్‌లు శుభ్రం చేస్తున్న వారిని మ్యాన్యువల్ స్కావెంజర్స్ కింద పరిగణించివారికి ప్రభుత్వ సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ ప్రతాప్‌సూర్యనారాయణరెడ్డి, జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, నగరపాలక కమిషనర్ నాగరాజు, డీపీఓ నాగరాజునాయుడు, డీఎంహెచ్‌ఓ ఈబీ దేవితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తన కొరత

- జిల్లాకు 7,635 క్వింటాళ్ల విత్తనాల కేటాయింపు
- 12 వేల హెక్టార్లకే సరిపోయే పరిస్థితి
- 19 వేల హెక్కార్లలో సాగుకు సిద్ధం
- మార్కెట్‌లో అధిక ధరకు కొంటున్న రైతులు
- తగినన్ని విత్తనాలు ఇవ్వాలని వినతి



వేరుశనగను పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)

మడకశిర, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రబీలో బోరు, బావులు కింద రైతులు వేరుశనగ పంటసాగు చేసేందుకు వీలుగా ప్రభుత్వం సబ్సిడీతో విత్తనకాయలను పంపిణీ చేస్తోంది. ఇప్పటికే జిల్లాలో సగానికి పైగా రైతులు బోరు, బావుల కింద వేరుశనగ సాగు చేశారు. వర్షాబావ కారణంగా రెండు సంవత్సరాలుగా భూగర్భజలాలు అడుగంటిపోయాయి. దీంతో సాగు విస్తీర్ణం కూడా తగ్గుతూ వచ్చింది. దీంతో నార్మల్ ఏరియా కూడా తగ్గుతూ వచ్చింది. ఈ రెండు, మూడు నెలలుగా కురుస్తున్న వర్షాల కారణంగా చెరువులు, కుంటలు నిండాయి. భూగర్భజలాల పెరిగాయి. దీంతో సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. ఇంతకాలం బీడుగా వదిలిన భూములను కూడా సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. ఖరీఫ్‌లో వేరుశనగ పంట దెబ్బతింది. దీంతో అందరూ రబీపై ఆశలు పెంచుకున్నారు. అయితే వారిని విత్తన వేరుశనగ పీడిస్తోంది. ప్రభుత్వం రబీలో బావుల కింద వేరుశనగ పంట సాగు చేసే రైతులకు సబ్సిడీతో వేరుశనగ పంపిణీ చేస్తోంది. అయితే నిబంధనలు ప్రకారం అర ఎకరాకు 30 కేజీల బస్తా, ఎకరాకు రెండు బస్తాలు, ఎకరా పైబడిన రైతులకు మూడు బస్తాల వేరుశనగను మాత్రమే పంపిణీ చేస్తున్నారు. దీంతో కొంత మంది రైతులు మార్కెట్లో విత్తనాలు కొనుగోలు చేయలేక.. అర, ఎకరాలోనే సాగు చేయడానికి సిద్ధమయ్యారు. ఇక రెండు, మూడు ఎకరాలో సాగు చేసే రైతులు బయట మార్కెట్‌లో విత్తనకాయలు కొనగోలు చేయాల్సి వస్తోంది. మార్కెట్‌లో నాణ్యమైన వేరుశనగ క్వింటాళ్లు రూ.8000 నుంచి రూ8500 వరకు పలుకుతోంది. నిబంధనలు సడలించి వేరుశనగను పంపిణీ చేస్తే పూర్తి స్థాయిలో బోరు బావుల కింద వేరుశనగ సాగు చేస్తామని రైతులు అందుతున్నారు. ప్రభుత్వం ఆ మేరకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఐదు మండలాలకు 2,050 క్వింటాళ్లు

నియోజక వర్గంలోని ఐదు మండలాలకు 2,050 క్వింటాళ్ల వేరుశనగను కేటాయించారు. క్వింటా వేరుశనగ ధర రూ.9600 కాగా, సబ్సిడీ రూ.3840పోను.. రైతుకు ప్రభుత్వం రూ.5760లకు విక్రయిస్తుస్తోంది. రైతు ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు తప్పని సరిగా ఉండాలన్నారు. ఇప్పటి వరకు మడకశిర ప్రాంతంలో 2400 ఎకరాల వరకు వేరుశనగ సాగు చేశారు.

తగినంత విత్తనం ఇవ్వాలి



రబీలో బోరుబావుల కింద వేరుశనగ సాగు చేసేందుకు రైతుకు అవసరమైనంత విత్తన వేరుశనగ పంపిణీ చేయాలి. ప్రస్తుతం నిబంధనల ప్రకారం పంపిణీ చేస్తున్న వేరుశనగ ఎకరాకు కూడా సరిపోదు. నాకు ఏడు ఎకరాల పొలం ఉంది. విత్తన సమస్య కారణంగా రెండు ఎకరాల్లోనే సాగుచేశాను. బయట మార్కెట్‌లో వేరుశనగ ధర అధికంగా ఉంది. నిబంధనలు సడలించి అవసరం ఉన్నంత మేర సబ్సిడీతో వేరుశనగ అందిస్తే పూర్తి స్థాయిలో పంట సాగు చేస్తాను.

- ఈరన్న, రైతు, కెంకెర

ఎన్‌డీపీఎస్ కోర్టును తరలించొద్దు

న్యాయవాదుల డిమాండ్.. రిలే నిరాహారదీక్ష



రిలే నిరాహార దీక్షలో న్యాయవాదులు

అనంతపురం క్రైం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎన్‌డీపీఎస్(నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ యాక్ట్) కేసుల విషయంలో కోర్టును తిరుపతికి తరలిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను ఉపసంహరించుకోవాలని బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఎన్‌డీపీఎస్ కోర్టును జిల్లాలో కాకుండా రాయలసీమ జోన్‌గా తిరుపతిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని బార్ అసోసియేషన్ వ్యతిరేకించింది. ఈ నేపథ్యంలో గురువారం నుంచి 10వతేదీ వరకు కోర్టు విధులను బహిష్కరిస్తున్నామని పేర్కొంది. గురువారం జిల్లా కోర్టు బయట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు రిలే నిరాహారదీక్ష చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఎన్‌డీపీఎస్ కేసులకు సంబంధించి ప్రతి జిల్లాలో కోర్టు ఉండటం వల్ల ఎలాంటి సమస్యలు ఉండేవి కాదన్నారు. ఇప్పుడు రాయలసీమ జోన్‌గా తిరుపతిని చేయడం వల్ల అక్కడికి వెళ్లాల్సి వస్తుందన్నారు. దీంతో కక్షిదారులు, న్యాయవాదులు సమస్యగా మారుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురుప్రసాద్, రాజేంద్రప్రసాద్, న్యాయవాదులు నాగశ్యామ్‌కిరణ్, నాగరాజు, నాగన్న, వెంకటరాముడు, గంగాధర్, లక్ష్మీ, వహీదా, పద్మజ, భాను తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఈ-పంట నమోదు

ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు



సిబ్బందితో సమీక్షిస్తున్న నరసింహారావు

అనంతపురం అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పక్కాగా ఈ పంటల నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని అనంతపురం జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు ఆదేశించారు. గురువారం స్థానిక ఉద్యాన శాఖ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షించారు. ఉద్యాన శాఖ పథకాలను అర్హులైన రైతులకు వర్తింపజేసేలా చర్యలు చేపట్టాలన్నారు. పరిపాలన అనుమతులు పూర్తయిన ప్యాక్ హౌస్, ఫాంపాండ్స్, కలెక్షన్ సెంటర్లు, కోల్డ్‌రూమ్‌ల నిర్మాణాలు మొదలు పెట్టేలా సంబంధిత రైతులకు తెలియజేయాలన్నారు. నర్సరీలకు లైసెన్స్‌లు తీసుకోవాలని నిర్వాహకులకు సమాచారం అందించాలని తెలిపారు. రబీ సీజన్‌లో మామిడి, టమోటా పంటలకు వాతావరణ ఆధారిత బీమా ప్రీమియాన్ని ఈనెల 15వతేదీలోగా చెల్లించేలా రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఉద్యాన పంటల్లో చీడ, పీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ హెచ్‌ఓ పల్లవి, ఇతర ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ రైతులు ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకోండి

అనంతపురం జిల్లాలోని ఎస్సీ కేటగిరికి చెందిన రైతులు ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ జిల్లా అధికారి నరసింహారావు ఒక ప్రకటనలో సూచించారు. కొత్తగా మామిడి, జామ, చీనీ, దానిమ్మ, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్, అంజూర పంటలను సాగుచేసే ఎస్సీ కేటగిరి రైతులకు 40 శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు. నీటి ఎద్దడి కలిగిన ప్రాంతాల్లో లైఫ్ సేవింగ్ ఇరిగేషన్ కోసం 20 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పు, మూడు మీటర్ల లోతు కలిగిన నీటి కుంటలను తవ్వుకునే రైతులకు 50 శాతం సబ్సిడీతో రూ.75వేలు అందజేస్తామన్నారు. ప్యాక్ హౌస్‌ల నిర్మాణం కోసం ఎస్సీ రైతులకు రూ.2లక్షల సబ్సిడీ వర్తిస్తుందన్నారు. తైవాన్ స్ప్రేయర్స్‌పై రూ.10వేల సబ్సిడీ, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్‌కు 50 శాతం సబ్సిడీని ఇస్తామని పేర్కొన్నారు. షెడ్ నెట్, పాలీహౌస్‌ల నిర్మాణం కోసం గరిష్ఠంగా 50 శాతం సబ్సిడీ వర్తింపజేస్తామన్నారు.

నేరాల నియంత్రణపై దృష్టి సారించండి: ఎస్పీ

అనంతపురం క్రైం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడిపై దృష్టి సారించాలని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. వీటిపై ప్రతిరోజూ నిఘా వేసి అడ్డుకట్ట వేయాలని ఆదేశిస్తూ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు గురువారం కార్యాచరణ ప్రణాళిక పంపారు. ఆ మేరకు పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు, విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ గురించి, రోడ్డు భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలని ఆదేశించారు.

8న చం.స్పందన జీవన సాఫల్య పురస్కార సభ

అనంతపురం కల్చరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీఓ హోంలో ఈనెల 8న ఉదయం 10.30 గంటలకు చం.స్పందన జీవన సాఫల్య పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహించనున్నట్లు స్పందన అనంత కవుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరశాస్త్రి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు చెందిన సీనియర్ రచయిత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డిని 'చం. స్పందన జీవన సాఫల్య పురస్కారం' కోసం ఎంపిక చేశామన్నారు. పురస్కారంతోపాటు నగదు బహుమతి అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు.

తుఫాను ప్రభావంతో వర్షం

అనంతపురం అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను ప్రభావంతో గురువారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. అనంతపురం, గుత్తి, యాడికి, పుట్లూరు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. బుధవారం జిల్లాలోని 13 మండలాల్లో వర్షం పడింది. అత్యధికంగా యల్లనూరులో 26.6 మి.మీ వర్షపాతం నమోదైంది. తాడిపత్రి 10.4, పెద్దపప్పూరు 4.6, నార్పల 4.2, రాప్తాడు 4.0, కూడేరు, శింగనమల 3.0, పెద్దవడుగూరు 2.6 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 1.4 మి.మీలోపు వర్షపాతం నమోదైంది.

కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కార్మిక వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. గురువారం అనంతపురం వచ్చిన కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ.. జిల్లాలో వేరుశనగ, హార్టికల్చర్ తర్వాత భవన నిర్మాణరంగం మూడో స్థానంలో ఉందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు 2009 సంవత్సరం నుంచి వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందని తెలిపారు. ప్రమాదాలు జరిగినా క్లెయిమ్‌లు రాక కార్మిక కుటుంబాలు అనేక ఇబ్బందులెదుర్కొన్నాయన్నారు. భవన నిర్మాణ కార్మికుల క్లెయిమ్‌లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రిస్వామిరెడ్డి, వీరయ్య, సూర్యనారాయణ, రామ్మోహన్, ముత్యాలప్ప, జిలాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగలో యాజమాన్య పద్ధతులతోనే మేలైన దిగుబడులు

శాస్త్రవేత్త డాక్టర్ బీవీ భాస్కర్ రెడ్డి

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వేరుశనగలో అధిక దిగుబడులు, అధిక నికరాదాయం రావాలంటే మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని కదిరి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బీవీ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బీడుపల్లి సమీపాన వేరుశనగ పంటలను గురువారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వేరుశనగ సాగులో గట్లపైన కలుపును సమర్థవంతంగా నివారించినట్లయితే చీడపీడల ఉధృతి తగ్గించవచ్చన్నారు. రబీసాగులో నూతన వంగడాలైన కదిరి అమరావతి, లేపాక్షి, చిత్రావతి, విశిష్ట రకాలను సాగుచేసుకోవాలని సూచించారు. కలుపు నియంత్రణ, ఎరువుల వాడకం గురించి డాక్టర్ అనిత అవగాహన కల్పించారు. కిలో విత్తనానికి 2 ఎం.ఎల్, ఇమ్మిడాక్లోప్రైడ్ 600ఎఫ్‌ఎస్ ప్లస్ 4ఎంఎల్ నీటితో విత్తన శుద్ధి చేసుకున్నట్లయితే వేరుపురుగు, తొలిదశలో రసంపీల్చే పురుగులను సమర్థవంతంగా నివారించవచ్చని డాక్టర్ రమేష్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వెంకటబ్రహ్మం, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

సదస్సులను సద్వినియోగం చేసుకోండి

● తహసీల్దార్ బండారు ఈరమ్మ

గార్లదిన్నె, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బండారు ఈరమ్మ తెలిపారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం నుంచి ఈ నెల 27 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం కొప్పలకొండ, ఈ నెల 7న కేశవాపురం, 10 మర్తాడు, 11 జంబులదిన్నె, 12 కనంపల్లి, 13 కోటంక, 17 కల్లూరు, అగ్రహారం, 18 బూదేడు, కృష్ణాపురం, 19 గార్లదిన్నె, 20 ఇల్లూరు, 21 ఎర్రగుంట్ల, 24 పెనకచెర్ల, 26 ముంటిమడుగు, అంకంపేట, 27 శిరివరం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఉంటాయన్నారు.

● రామగిరి: మండలంలో శుక్రవారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ నరేశ్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం రామగిరిలో, ఈ నెల 10న నసనకోటలో, 11న పేరూరు, 12న ఎంసీపల్లి, 13న కొండాపురం, 17న మక్కినవారిపల్లి, 18న శేషంపల్లి, 19న గంతిమర్రి, 20 కుంటిమద్ది, 24న పోలేపల్లిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు.

నేడు అక్కదేవతల పూజారి ఎంపిక

అనంతపురం రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచానపల్లి, అక్కంపల్లి బొలికొండ అక్క మహాదేవతల గుడి పూజారి ఎంపిక కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్న ట్లు గ్రామ పెద్దలు తెలిపారు. 70ఏళ్ల కోసారి ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎలవ పూజ ఉంటుంద న్నారు. శనివారం గుడి నుంచి ఊరేగింపు చేపడుతామన్నారు. భక్తులు పెద్ద తరలిరావాలని కోరారు.

క్రిస్మస్ వేడుకలు



కేక్ పంచుకుంటున్న పాస్టర్లు

అనంతపురం రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లి పంచాయతీ సజ్జలకాలువలోని చర్చిలో రాయలసీమ గాస్పల్ మినిస్ట్రీస్ ట్రస్టు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర ఉత్తమ సామాజిక సేవా అవార్డు గ్రహీత చల్లా కిషోర్ చౌదరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు హాజరై మాట్లాడారు. అనంతరం కేక్ కట్‌చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

నేడు ఎమ్మెల్యే రాక

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుముక్కల గ్రామంలో మ శుక్రవారం నిర్వహించనున్న రెవెన్యూ సదస్సుకు ఎమ్మెల్యే పరిటాలసునీత ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవిన్యూ గ్రామానికి చెందిన రైతులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

రుణమేళా..

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కెనరాబ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మూడో రోడ్డులోని జీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఎంఎస్‌ఎంఈ ఔత్సాహిక వేత్తలకు రుణమేళా నిర్వహించనున్నట్లు ఆ బ్యాంకు సీనియర్ మేనేజర్ వెంకయ్య తెలిపారు. ముఖ్య అతిథులుగా కెనరాబ్యాంకు ఆర్‌ఎం లారెన్స్, డివిజనల్ మేనేజర్ షేక్ మహబూబ్, ఎంఎస్‌ఎంఈ సులబ్ హెడ్ కార్తిక్ ప్రకాష్, ఎల్‌డీఎం నర్సింగరావులు హాజరవుతారన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురం రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ టౌన్- 2 డీఈఈ శ్రీనివాసులు , డి-1సెక్షన్ ఏఈఈ నీలకంఠ తెలిపారు. ఈ మేరకు గురువారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు తపోవనం, ప్రశాంతి నగర్, సోమనాథ్‌నగర్, శాంతినగర్, జనశక్తి నగర్, రజకకాలనీ, ఎంజీ పెట్రోల్‌బంకు, 1నుంచి3వరోడ్డు వరకు, జనచైతన్య కాలనీ, హమాలీ కాలనీ, ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండద న్నారు. అలాగే డి-1సెక్షన్ పరిధిలో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు సంఘమేష్ సర్కిల్, అశోక్‌నగర్, కొత్త హౌసింగ్ కాలనీ, బోయవీధి, సూర్యనగర్, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, నేతాజీ పార్కు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శారదా నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని డి - 4 సెక్షన్ ఏఈ ఈ. మహేష్ తెలిపారు.

'సస్పెన్షన్ కాలాన్ని ప్రత్యేక సెలవుగా పరిగణించాలి'

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సస్పెన్షన్ కాలాన్ని ప్రత్యేక సెలవుగా పరిగణించాలని ఎస్కేయూ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబుని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులపై వేధింపుల పర్వం కొనసాగిందని గుర్తుచేశారు. వీసీగా రామకృష్ణారెడ్డి అకారణాలతో సస్పెండ్ చేశారని మండిపడ్డారు. వారికి న్యాయం చేసే లా ప్రత్యేక కమిటీ ఏర్పాటుచేసి, సస్పెన్షన్ కాలాన్ని ప్రత్యేక లీవ్‌గా పరిగణించాలని విజ్ఞప్తిచేశారు. ఉద్యోగులు రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వృథాగా ఫీడర్ చానల్

● రూ. 40 లక్షలతో నిర్మించినా.. నెరవేరని లక్ష్యం

● అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం.. కంపచెట్లతో నిండిన వైనం



సలకంచెరువుకు వెళ్లే ఫీడర్ చానల్

శింగనమల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక శింగనమల చెరువు నిండిన తరువాత వృథాగా పోయే నీరు సలకంచెరువు చెరువుకు వెళ్లేందుకు గత 22 సంవత్సరాలు కిందట రూ.40 లక్షలు ఖర్చుతో 10 కిలో మీటర్ల ఫీడల్ చానల్ ఏర్పాటు చేశారు. అయితే దాని ద్వారా ఇప్పటి వరకు సలకం చెరువుకు చుక్క నీరు కూడా చేరిన సందర్భంలేదు. ఫీడర్ చానల్ నిర్మించిన ప్పటి నుంచి శింగనమల చెరువు నిండకపోవడమే కారణం. దీంతో కాలువ పొడువునా కంపచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి పూడిపోయింది. మూడేళ్ల కిందట శింగనమల చెరువు నిండి ఐదు నెలాలు నీరు పారినా, వాటిని కాలువకు మళ్లించడంలో అధికారు లు, పాలకులు విఫలమయ్యారు. ప్రస్తుత పాలకులైనా కాలువ మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

రూ.40 లక్షలు వృథా

శింగనమల చెరువు నిండిన తరువాత వృథాగా పారే నీటిని సలకం చెరువుకు మళ్లించేందుకు 2002 సంవత్సరంలో అప్పటి కలెక్టర్ సోమేష్‌కుమార్ చర్యలు చేపట్టారు. వృథా నీటిని సలకంచెరువుకు చేర్చేందుకు గోవిందరాయనిపేట, ఈస్టు నరసాపురం, పెద్ద మట్లగొంది, చిన్న మట్లగొంది గ్రామాల మీదుగా రూ. 40 లక్షల వ్యయంతో సలకం చెరువు చెరువుకు 10 కిలో మీటర్ల కాలువ ఏర్పాటు చేశారు. ఈ కాలువ ద్వారా నీరు చేరుతే దాదాపు 10 గ్రామాల్లో భూరగ్భజలాలు పెరుగుతాయని, అలాగే సలకం చెరువకు నీరు చేరుతే పంటలు సాగు చేయవచ్చని ఆయా గ్రామాల రైతులు అంటున్నారు. 22 సంవత్సరాలకుగాను ప్రారంభంలో ఒక సారి మాత్రమే చెరువుకు నీరు కొద్దిగా చేరింది. ఇప్పటి వరకు లేదు. దీంతో కాలువ ఎక్కువ శాతం పూడిపోవడంతో పాటు కంపచెట్ల పెరగ డంతో, అక్కడ కాలువ ఉందా అనే సందేహం కలుగు తోంది.

20 నుంచి 40 టీఎంసీల నీరు ఏటిపాలు

గత మూడేళ్ల కిందట శింగనమల చెరువు నిండిపోయిన తరువాత వృథానీటిని ఫీడర్ చానల్‌కు మళ్లించాల్సి ఉంది. అయితే అప్పట్లో అధికారులు, పాలకులు ముందస్తు ప్రణాళికతో కాలువ మరమ్మతులు చేసి ఉంటే నీరు కాలువకు మళ్లించే అవకాశం ఉండేది. అయితే నిర్లక్ష్యం కారణంగా ఐదు నెలల పాటు శింగనమల చెరువు నుంచి దాదాపు 20 నుంచి 40 టీఎంసీలు నీరు ఏటిపాలు చేశారని అప్పట్లో రైతులు, రైతు సంఘాల నాయకలు, మేధావులు విమర్శించారు.

భూగర్భజలాలు పెరుగుతాయి



మా పొలం కాలువ సమీపంలో ఉంది. కాలువ ఏర్పాటు స మయంలో మాకు భూగర్భజలాలు పె రుగు తాయని సంతోష పడ్డాం. అయితే ఇంతవరకు ఈ కాలువ ద్వారా నీరు పారలేదు. శింగనమల చెరువు నీరు వృథాగా పోతున్నాయి.

- అట్టే వీరనాయప్ప, రైతు, సోదనపల్లి

కాలువ పారితే నీటి సమస్య ఉండదు



మా గ్రామం మీదుగా శింగనమల చెరువు నుంచి సలకం చెరువుకు కాలువ తవ్వారు. కాలువలో నీరు పారితే మాకు బోర్లలో నీరు పుష్కలంగా ఉంటుందని అనుకున్నాం. అయితే ఈ రోజు వరకు కాలువలో చుక్క నీరు రాలేదు. మెత్తం పూడిపోయింది. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలి.

-నారాయణ, రైతు, పెద్ద మట్లగొంది

మరమ్మతులు చేయాలి



సలకంచెరువుకు ఫీడల్ చానల్‌ను గతంలో రూ.40 లక్షలుతో తవ్వారు. అప్పటి నుంచి ఆ కాలువ ద్వారా మా చెరువుకు నీరు రాలేదు. ప్రస్తుతం కాలువ పూర్తిగా పూడిపోయింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు కాలువ మరమ్మతులు చేపట్టి, నీరు పారడానికి చర్యలు తీసుకోవాలి.

- తిరుపాలు, రైతు, సలకంచెరువు

ఎమ్మెల్యే దృష్టి సారించాలి



ఫీడల్ చానల్ మరమ్మతులు చేపడితే భూగర్భజలాలు పెరిగి పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తీరుతుంది. గత పాలకులు పట్టించుకోలేదు. దీంతో శింగనమల చెరువు నీరు ఏటి పాలు అవుతోంది. ఇప్పటికైనా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ నిధులు కేటాయించాలి. కాలువ ద్వారా సలకం చెరువుకు నీరు చేరేవిధంగా చర్యలు తీసుకోవాలి.

- నేసే మధు, సీపీఐ నాయకుడు

అంచనాలు వేసి పంపాం

గోవిందరాయపేట నుంచి స లకంచెరువు చెరువు వరకు ఉన్న కాలువలో కంప చెట్లు తొలగించేందుకు, మరమ్మతులకు ప్రణాళికలు తయారు చేశాం. రూ.39 లక్షలు వరకు ఎస్ ఆర్‌జీఎస్ కింద పనులు చేపట్టేం దుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

- సాయినాథ్, జేఈ, ఇరిగేషన్ శాఖ

పనిచేయాలంటే ఉండండి.. లేదంటే వెళ్లిపోండి

● సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

● రెవెన్యూ అధికారులపై ఎమ్మెల్యే అసంతృప్తి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ఆ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే పరిటాల సునీత తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ గురువారం అనంతపురం నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గతంలో చెన్నేకొత్తపల్లి, రామగిరి, రాప్తాడు మండలాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిని పరిష్కరించాలని అధికారులకు చెప్పినా, ఇప్పటి వరకు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు కాళ్లు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగారన్నారు. తమ ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి ప్రజలకు రాకూడదనే ఉద్దేశ్యంతో మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. ప్రభుత్వం మారినా రెవెన్యూ అధికారుల్లో అదే నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం నెలల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగాల్సి వస్తోందన్నారు. కొన్ని సందర్భాల్లో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినా... కిందిస్థాయి అధికారులు స్పందించడం లేదన్నారు. గతంలోలాగా నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదని హెచ్చరించారు. పనిచేయడం ఇష్టం లేకపోతే..... మరో ప్రాంతానికి వెళ్లిపోవచ్చన్నారు. ప్రజలను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవన్నారు. భూముల విలువ పెరిగిన నేపథ్యంలో చిన్న చిన్న వివాదాలు ఏర్పడుతున్నా యన్నారు. చివరికీ అన్నదమ్ముల మధ్య ఆ వివాదాలు లేకపోలేదన్నారు. చిన్న వివాదాలే పెద్దవిగా మారక మునుపే పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మరికొన్ని ప్రాంతాల్లో లేని సమస్యలను సృష్టిం చుకుంటున్నారని, సామరస్య పూర్వకంగా పరిష్కరించు కోవాలని సూచించారు. నియోజకవర్గంలోని మండలాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో అధికారుల దృష్టికి సమస్యలు తీసుకొచ్చి, పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉన్నతికి నైపుణ్యాలే ప్రమాణం

● జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ



మాట్లాడుతున్న వీసీ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉన్నత భవిష్యతుకు వారిలోని నైపుణ్యాలే ప్రామాణికమని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో గురువారం స్టూడెంట్ చాప్టర్ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన వేడుకలకు వీసీ సుదర్శనరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. చదువుతోపాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా వీసీ సూచించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ అజిత, ప్రొఫెసర్లు భానుమూర్తి, శశిధర్, వైశాలి గోర్పాడే, అరుణకాంతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలు కాలవ, సునీతకు ఎంపీఈఓల సన్మానం



ప్రభుత్వ విప్ కాలవ, ఎమ్మెల్యే పరిటాల సునీతను సన్మానిస్తున్న ఎంపీఈఓలు

అనంతపురం అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతను వ్యవసాయ శాఖ ఎంపీఈఓల సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షుడు రెడ్డి ప్రసాద్, పలువురు నాయకులు సన్మానించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న తమ సమస్యలపై స్పందించి, తిరిగి జిల్లాకు రప్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం అనంతపురం నగరంలోని వారి నివాసాల్లో, వారిని కలిసి శాలువ కప్పి సన్మానించారు. జ్ఞాపికలను అందజేశారు. ఎంపీఈఓల సంఘం నాయకులు నరేష్‌బాబు, విజయనాయుడు, భాస్కర్‌నాయక్, సాంబశివ, నాగేషు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్మిక మంత్రికి ఘన స్వాగతం



మంత్రికి స్వాగతం పలుకుతున్న వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీల శాఖ మంత్రి సుభాష్‌కు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ఘన స్వాగతం పలికారు. గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రిని స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలిసి శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి, ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కూచి హరి, కురబ నారాయణస్వామి, పీఎం లక్ష్మీప్రసాద్, సంగా తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

జీఓ 16ను పునరుద్ధరించాలి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గీత కార్మిక కుటుంబాల ఐక్యత కోసం జీఓ 16ను పునరుద్ధరించాలని టీడీపీ రాష్ట్ర ఈడిగ సాధికార సమితి సభ్యుడు వేణుగోపాల్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం అనంతపురం వచ్చిన కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి ఈడి సాధికార సమితి ఆధ్వర్యంలో స్థానిక లలితకళాపరిషత్‌లో సత్కరించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌గౌడ్ మాట్లాడుతూ... గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. గీత కార్మికులందరినీ ఏకతాటిపైకి తెచ్చేలా సంక్షేమ పథకాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఈడిగ సాధికార సమితి సభ్యులు అగ్రహారం రామకృష్ణగౌడ్, వెంకటేష్, నాగభూషణ్, నారాయణస్వామి, శివకుమార్, గోపాల్, లాలప్ప, గంగాధర, తలుపుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వేగం, సౌండ్‌పై ట్రాఫిక్ పోలీసుల దృష్టి

● ఒంటి చక్రంపై బైక్ నడిపిన యువకుడికి రూ.6వేల జరిమానా

● పలు ద్విచక్రవాహనాల సైలెన్సర్ల స్వాధీనం

అనంతపురం క్రైం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలో అతి వేగంగా, అధిక శబ్దం చేస్తూ బైక్‌లను నడపడంపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి పెట్టారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు సీఐ రఘువంశ ప్రసాద్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. కూడేరుకు చెందిన 22 ఏళ్ల మోహన్ సూర్య గురువారం నగరంలోని కోర్టు రోడ్డుకు బైక్‌లో వచ్చాడు. ఒంటి చక్రంపై బైక్‌ను ఎగిరిస్తుండగా ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. ఆర్టీఓ ఎదుట హాజరు పరచగా రూ.6వేలు జరిమానా విధించారు. బైక్‌పై వేగంగా వెళ్తున్న వారికి జరిమానా విధించారు. అధికంగా సౌండ్ వచ్చే సైలెన్సర్లను తొలగించారు. గత కొన్ని రోజుల వ్యవధిలో 100కుపైగా తీయించినట్లు సమాచారం. ఆటోలలో సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసుకున్న వారిపై జరిమానా విధించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్దుర్తిక్రాస్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. కొత్తచెరువు మండలం లింగారెడ్డిపల్లికి చెందిన నరేంద్రకుమార్ ద్విచక్రవాహనంలో ధర్మవరం వైపు వెళ్తుండగా కారు ఢీకొనడంతో తీవ్రగాలయ్యాయి. అతడిని స్థానికులు కొత్తచెరువు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం

● పటిష్టమైన చర్యలు చేపట్టండి: ఎస్పీ రత్న



తగరకుంటలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ

చెన్నేకొత్తపల్లి/రామగిరి/కనగానపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను పూర్తిగా అరికట్టడానికి ఎప్పటికప్పుడు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ వి.రత్న సూచించారు. రామగిరి పోలీస్‌సర్కిల్ పరిధిలోని చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి పోలీస్‌స్టేషన్లను ఎస్పీ గురువారం తనిఖీ చేశారు. ఆయా స్టేషన్లలో రికార్డులను పరిశీలించి సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సమస్యాత్మక గ్రామాలతో పాటు ఫ్యాక్షన్ గ్రామాల పరిస్థితి గురించి డీఎస్పీ శ్రీనివాసు లు, సీఐ శ్రీధర్‌తో ఆరాతీశారు. అదే విధంగా ట్రాఫిక్‌పై దృష్టి సారించాలన్నారు. భూతగాదాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని బాలికల అదృశ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల ఘటనలో అధికంగా మృత్యువాత పడుతున్నారన్నారు. కుంటిమద్ది చెరువుకట్టపై ఏర్పాటు చేసిన పైలాన్‌ను పరిశీలించారు. కనగానపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఎస్పీ పండ్లమొక్కలను నాటారు. అలాగే ఎస్పీ కనగానపల్లి మండలంలోని ఫ్యాక్షన్ గ్రామమైన తగరకుంటను సందర్శించారు. గ్రామస్థులతో మాట్లాడారు... ఫ్యాక్షన్ జోలికి వెళ్లవద్దని ప్రశాంతంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో రామగిరి ఎస్ఐ సుధాకర్‌యాదవ్, కనగానపల్లి ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

యురేనియం తక్కువగా ఉండాలి

● జేఎన్‌టీయూ ప్రొఫెసర్

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాల్లో యురేనియం సాంద్రత తక్కు స్థాయి లో ఉంటే ఆరోగ్యకరమని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల కెమికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ పేర్కొన్నారు. కళాశాల విద్యార్థి డాక్టర్ మంజునాథ్ రాసిన స్పేషియల్ డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ యురేనియం అండ్ అసోసియేటెడ్ వాటర్ క్వాలిటీ పారామీటర్స్ ఇన్ గ్రౌండ్‌వాటర్ అనే అంశంపై అంతర్జాతీయ ఓరియంటల్ జర్నల్స్ ఆఫ్ కెమిస్ట్రీలో వ్యాసం ప్రచురితమైంది. ఈ సందర్భంగా మంజునాథ్‌ను ప్రొఫెసర్లు ఎస్వీ సత్యనారాయణ, జీవీ సుబ్బారెడ్డి అభినం దించారు. ప్రొఫెసర్ సత్యనారాయణ మాట్లాడుతూ నీటిలో ఫ్లోరైడ్, క్లోరైడ్, నైట్రేట్స్, యారేనియం సాంద్రతలు ఉంటాయని తెలిపారు. వీటి సాంద్రత ఎక్కువున్న నీటిని త్రాగడం ద్వారా కిడ్నీ వ్యాధులకు గురైయ్యే ప్రమాదముంటుందని తెలిపారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజనం హర్షణీయం

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళా శాలల్లో హాజరు శాతం, విద్యాప్రమాణాల మెరుగుదల కోసం ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని మంత్రి నారా లోకేశ్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. ఈ పథకం అమలు చేయడంపై విద్యార్థి లోకం ఆనందాన్ని వ్యక్తం చేస్తోందన్నారు. ఈ మేరకు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో విద్యను అభ్యసించేందుకు చుట్టు పక్కల ప్రాంతాల విద్యార్థులు వస్తున్నారన్నారు. కరువు జిల్లా అనంత విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పేద పిల్లలకు ఆకలి తీర్చడంతోపాటు డ్రాప్ అవుట్స్ తగ్గే అవకాశం ఉందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా హామీలను అమలు చేస్తూ ముందుకు సాతోందన్నారు. విద్యార్థుల తరఫున మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రైతులు ఆందోళన చెందకండి

● ప్రభుత్వం ఆదుకుంటుంది : జిల్లా వ్యవసాయాధికారి

గార్లదిన్నె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోంటోందని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. కల్లూరు, ఎగువపల్లిల్లో వర్షాలకు దెబ్బతిన్న వరిపంటలను ఆమె గురువారం మండల వ్యవసాయాధికారి సోమశేఖర్‌తో కలసి సందర్శించారు. రైతులతో మాట్లాడారు. గత నాలుగురోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వరిపంటలు తడిసిపోవడంతో ధాన్యం పూర్తిగా నానిపోయిందని రైతులు తెలిపారు. చేతికందే సమయంలో ఇలా జరగడంతో తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోయారు. వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోంటోందన్నారు. ఇందుకు సంబంధించిన పంటనష్ట వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని తెలిపారు. ఎవరూ ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సోమశేఖర్, రైతులు బాబయ్య, అశోక్, కృష్ణయ్య, వీహెచ్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ నేల దినోత్సవం



నేల దినోత్సవంలో పాల్గొన్న వ్యవసాయాధికారులు, విద్యార్థులు

నార్పల, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండ్లపల్లి జడ్పీ పాఠశాలలో గురువారం ప్రపంచ నేల దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ రేకులకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త విజయశేఖర్‌బాబు, అనంతపురం భూసార పరీక్ష కేంద్రం ఏడీఏ రోజాపుష్పలత, తాడిపత్రి డివిజన్ ఏడీఏ చంగల్‌రాయుడు, బండ్లపల్లి జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం శేషగిరి, మండల వ్యవసాయ అధికారి చెన్నవీరస్వామి హాజరయ్యారు. నేల స్వభావం, వాటి సంరక్షణ గురించి విద్యార్థులకు , రైతలకు వివరించారు. రైతులు భూసార పరీక్షలను తప్పక చేయించుకోవాని తెలిపారు. అనంతరం విద్యార్థులకు భూసార పరీక్ష లపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు, గెలుపొందిన వారికి మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి రాము, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూసారాన్ని సంరక్షించుకుందాం

రైతులు భూసార పరీక్షలను క్రమం తప్పకుండా చేయిం చుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ చంగల్‌రాయుడు పేర్కొన్నారు. సూక్ష్మ పోషకాలతో భూసారాన్ని కాపాడుకోవాలన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ గోదాము వద్ద జైకిసాన్ ఉత్పత్తులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జైకిసాన్ ఉత్పత్తులు నాణ్యంగా, ధర తక్కువతో లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్పల సహకార సంఘం సీఈఓ భవాని ప్రసాద్, జైకిసాన్ సంస్థ జిల్లా మార్కెటింగ్ ప్రతినిధి రాజేష్‌ఖన్నా, కిరన్‌కుమార్, హర్షవర్ధన్, బాబయ్య, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వాలకు రూ.లక్ష విరాళం



రూ.లక్ష అందజేస్తున్న పోతుల లక్ష్మీనరసింహులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆదేశాల మేరకు అర్బన్ నియోజ కవర్గంలో లక్ష సభ్యత్వాలు పూర్తి చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు పేర్కొన్నారు. గురువారం టీడీపీ అర్బన్ కార్యాలయంలో టీడీపీ నాయకులు గంగారామ్, ఎమ్మెల్యే వ్యక్తిగత సెక్రటరీ శ్రీధర్‌కు పార్టీ సభ్యత్వాల కోసం ఆయన రూ.లక్ష అందజేశారు. పదో డివిజన్‌లో ఇప్పటికే 500 సభ్యత్వాలు పూర్తి చేశామని, పార్టీ సభ్యత్వం తీసుకునేందుకు ఆసక్తి ఉన్నా రుసుం చెల్లించలేని పేదల కోసం తన సొంత డబ్బు అందజేశానని తెలిపారు. రజక, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు పరమేశ్వరన్, కడియాల కొండన్న, నాయకులు రాహుల్, సందేశ్ తదితరులు పాల్గొన్నారు.

'నాయీబ్రాహ్మణులూ.. సభ్యత్వం తీసుకోండి'

అనంతపురం అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అర్బన్ పరిధిలోని నాయీబ్రాహ్మణులు టీడీపీ సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కడియాల కొండన్న కోరారు. టీడీపీ అర్బన్ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. నాయీబ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడే ఏకైక పార్టీ టీడీపీనేనన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆధ్వ ర్యంలో నియోజకవర్గంలోని నాయీబ్రాహ్మణులు సభ్యత్వం చేయించు కోవాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఏర్పాటుచేసిన వీహెచ్‌పీఎస్ నిరంతర పోరాటాలు చేస్తోందని ఆ సంస్థ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న పేర్కొన్నారు. వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో గురువారం 65వ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ పోస్టర్లను ఆవిష్కంచారు. ఈ నెల 15న ఎన్‌జీఓ హోమ్‌లో అంతర్జాతీయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మధు, రాముడు, నాగ రాజు, శ్రీనివాసులు, రేఖలకుంట రామాంజినేయులు, స్వంత్ర కుమారి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



గొరిదిండ్ల సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

ఆత్మకూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తలుపూరు, గొరిదిండ్ల, తోపుదుర్తి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ చేతులు మీదుగా గురువారం భూమిపూజ చేశారు. కళ్యాణదుర్గం-అనంతపురం రహదారి నుంచి తలుపూరు వ రకు రూ. కోటితో తారురోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభించారు. అలాగే తోపుదుర్తి, గొరిదిండ్ల గ్రామాల పరిధిలో రూ. 2కోట్లకు పైగా నిధులతో నూతన సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నట్లు బాలాజీ తెలిపారు. సంక్రాంతి కానుకగా పనులు పూర్తి చేసి లో ఓల్టేజీ సమస్య పరిష్కరిస్తున్నట్లు అధికారులు తెలపారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని బాలాజీ కోరారు. ఈఈ మనోరమ, డీఈ రంగస్వామి, తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఏపీఓ సుజాత, టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు నారాయణస్వామి,శశాంక్ చౌదరి, పరశురామ్, క్రిష్ణమోహన్ చౌదరి, మాజీ జడ్పీటీసీ కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

ఎస్ఎఫ్ఐ మహాసభలను విజయవంతం చేయండి

గుత్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 17, 18 తేదీలలో జరిగే ఎస్ఎఫ్ఐ 32వ జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని ఆ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరమేష్, సిద్దు, రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ పిలుపునిచ్చారు. స్థానిక సాయి జూనియర్ కళాశాలలో గురువారం వారు మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు పోరాటానికి ఈ జిల్లా మహాసభల్లో తీర్మానించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మండల అధ్యక్షకార్యదర్శులు ధనుంజయ, బాలాజీ, నాయకులు శివ, నవీన్, షేక్షావలి పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న టీడీపీ నాయకులు

కూడేరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి. నారాయణపురం గ్రామంలో రూ. 20లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు టీడీపీ నాయకులు గురువారం భూమి పూజ చేశారు. గ్రామంలోని పిచ్చయ్య కాలనీలో ఈ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచు హనుమంతరెడ్డి, టీఎన్‌టీయూసీ నాయకులు రోలర్‌నాగరాజు, ఎంఎంహళ్లి రాజు, దేవేంద్ర, లక్ష్మన్న, సీపీఐ నాయకులు మల్లికార్జున, బోయ ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గంరూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల న్యాయ సేవాధికారి కమిటీలో పారాలీగల్ వలంటీర్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ బండే సుభాన్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవాదృక్పథం కలవారు, విద్యార్థులు, రాజకీయాలతో సంబంధం లేని స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సేవకులు తదితరులు అర్హులన్నారు. దీని కోసం ఎటువంటి జీతం గానీ, లాభాపేక్ష కానీ లేకుండా సాంఘీక సంక్షేమం కోసం ఆసక్తి గల అభ్యర్థులు ఆఫీస్ ఆఫ్ ద చైర్మన్, సివిల్ జడ్జి మండల లీగల్ సర్వీస్ కమిటీలో బయోడేటాను సమర్పించాలని ఆయన కోరారు.

కొనసాగిన రైల్వే ఎన్నికల పోలింగ్

గుంతకల్లు, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగ సంఘ గుర్తింపు ఎన్నికల్లో భాగంగా రెండవ రోజైన బుధవారం కూడా పోలింగ్ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా మంగళవారం ఓటును వినియోగించుకోలేకపోయిన ఉద్యోగ ఓటర్లు పట్టణంలో ఏర్పాటుచేసిన ఆరు పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటును వినియోగించుకున్నారు. సాయంత్రం వరకూ జరిగిన ఓటింగ్‌లో మొత్తం ఓట్లు 14,359 ఓట్లకు గానూ 11,992 ఓట్లు పోలయ్యాయి. రెండు రోజులు కలిపి 83.51 శాతం ఓట్లు పోలయ్యాయని పర్సనల్ శాఖాధికారులు తెలియజేశారు. చివరి రోజైన శుక్రవారం కూడా ఈ పోలింగ్ ప్రక్రియ కొనసాగనుంది.

కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడిగా తిమ్మారెడ్డి

గుంతకల్లు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడిగా మునలిరెడ్డిగారి తిమ్మారెడ్డిని నియమిస్తూ జిల్లా కమిటీ ఉత్తర్వులను వెలువరించింది. గుంతకల్లు, గుత్తి మండల కమిటీలను గురువారం ప్రకటించారు. గుంతకల్లు పట్టణ కమిటీ అధ్యక్షుడిగా తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడిగా గుల్‌ఫరోష్ జిలాన్, ప్రధాన కార్యదర్శిగా షేక్ మహబూబ్ బాషా, మైనారిటీ అధ్యక్షుడిగా షేక్ ఇస్మాయిల్, మండల కమిటీ అధ్యక్షుడిగా బోయ చంద్రశేఖర్, మండల మైనార్టీ అధ్యక్షుడిగా నబీరసూల్‌ను నియమించారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా బ్యాళ్ల ప్రసాద్

ఉరవకొండ: కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన బ్యాళ్ల ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి నుంచి ఉత్తర్వులు అందినట్లు ప్రసాద్ తెలిపారు. అలాగే జిల్లా కార్యదర్శులుగా శీనా, శ్రీరాములు నాయక్ ఎన్నికైనట్లు చెప్పారు.

14న మెగా జాబ్‌మేళా

ఉరవకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పయ్యావుల సోదరుల ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ గురువారం ప్రకటనలో తెలిపారు. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా ఉంటుందన్నారు. 10వ తరగతి, ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, పీజీ చేసిన వారు అర్హులన్నారు. జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవలని కోరారు. 9502236524 నెంబర్‌కు వ్యాట్సప్‌లో బయోడేటా పంపవచ్చని ఆయన పేర్కొన్నారు.

రహదారికి విముక్తి

కణేకల్లు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంబిగనూరు గ్రామంలో గత వైసీపీ పాలనలో కక్షపూరితంగా బంద్ చేసిన ఓ రహదారికి అధికారులు విముక్తి కల్పించారు. గ్రామానికి చెందిన కొట్రేగౌడ, ప్రభాకర్‌గౌడలకు సంబంధించిన సర్వే నంబర్ 135లో ఉన్న భూమికి వెళ్లేందుకు స్థానిక పాఠశాల పక్కన వందల ఏళ్ల నుంచి రహదారి ఉండేది. గతంలో సర్పంచ్ ఎన్నికల్లో వారు టీడీపీకి మద్దతు తెలిపారని స్థానిక వైసీపీ నాయకులు నాలుగేళ్ల క్రితం ఆ రహదారిని బంద్ చేయించారు. దీంతో రైతులు ఆందోళన చేసినప్పటికీ వైసీపీ నాయకులు అధికార బలంతో రహదారికి గోడలు కట్టేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఉండడంతో టీడీపీ నాయకులు అధికారులను సంప్రదించి భూమికి ఉన్న సరైన పత్రాలను చూపించారు. దీంతో తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ లక్ష్మణ్ క్షేత్రస్థాయిలో పర్యటించి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. అలాగే స్థానికులతోనూ విచారణ చేయగా అనేక ఏళ్ల నుంచి అక్కడ రహదారి ఉన్న విషయాన్ని అధికారులకు వివరించారు. దీంతో అధికారులు రహదారికి అడ్డంగా ఉన్న నిర్మాణాన్ని తొలగించి రైతులకు రహదారిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

బాల్యవివాహాలపై అవగాహన అవసరం

రాయదుర్గంరూరల్/గుంతకల్లుటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి సూచించారు. పట్టణంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం ఆమె బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ఇప్పటికీ ఇంకా బాల్యవివాహాలు జరుగుతున్నాయంటే బాధాకరమన్నారు. బాలికలు బాల్యవివాహాలు చేస్తే కలిగే నష్టాలను తమ తల్లిదండ్రులకు వివరించాలన్నారు. బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. గుంతకల్లు పట్టణంలోని సత్యనారాయణ పేటలోగల ఉర్దూ పాఠశాలలో ప్రభుత్వ ఆసుపత్రి పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

కూడేరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా మోసాలకు పాల్పడుతారని, అప్రమతంగా ఉండాలని సైబర్ సెల్ సిబ్బంది ఎన్‌సీసీ విద్యార్థులకు సూచించారు. మండలంలోని ఎన్‌సీసీ క్యాంపులో గురువారం సైబర్‌సెల్ సిబ్బంది హరికృష్ణ, రామాంజనేయులు ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొరియర్ పేరుతో చైల్డ్ ఫోర్నోగ్రఫీ, డిజిటల్ అరెస్ట్, ఓటీపీ మోసాలు, ఫేక్‌లోన్‌యాప్స్, హనీట్రాప్, లాటరీలు, డెబిట్‌కార్డులు, క్రెడిట్ కార్డు మోసాలతో లక్షల పెట్టుబడులు పెడితే కోట్లు వస్తాయని నమ్మబలకడం, వీడియోకాల్స్ చేయడం వంటి మోసాలకు పాల్పడుతారన్నారు. సైబర్ నేరగాళ్లు మోసం చేస్తే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చునని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో వేగం పెంచాలి: విప్ కాలవ


బొమ్మనహాళ్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

బొమ్మనహాళ్/ కణేకల్లు డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు పార్టీ సభ్యత నమోదును మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. బొమ్మనహాళ్ మండలం ఎల్‌బీనగర్ గ్రామంలో గురువారం టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. కాలవ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ సభత్వ నమోదు చేసుకుంటే పార్టీ అధిష్టానం రూ. 5లక్షల ప్రమాద బీమాను చెల్లిస్తుందని, అలాగే బాధిత కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు. కనుక ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదు చేసుకోవాలన్నారు. యూనిట్ ఇన్‌చార్జులు, క్లస్టర్ కన్వీనర్లు సభ్యత్వ నమోదులో వేగం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ కన్వీనర్లు కేశవరెడ్డి, ధనుంజయ, నాయకులు కొత్తపల్లి తిమ్మరాజు, నారాయణస్వామి, అప్పారావు, గోరంట్ల వెంకటేశులు, మోహన్, యూనిట్ ఇన్‌చార్జిలు గోవిందు, సోమనాథ్‌గౌడ్, కావలి ప్రభు తదితరులు పాల్గొన్నారు. అలాగే కణేకల్లు మండలకేంద్రంలోని చంద్ర రైస్‌మిల్‌లో కాలవ శ్రీనివాసులు టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. మండలానికి 15 వేల సభ్యత్వాలు లక్ష్యంగా పెట్టామని, ఇప్పటివరకు కేవలం ఎనిమిది వేలు పూర్తి చేశారని అన్నారు. ఈ నెలాఖరుకల్లా మిగతా సభ్యత్వ నమోదును పూర్తి చేయాలని సూచించారు. మండల కన్వీనర్ లాలెప్ప, నాయకులు ఆనంద్‌రాజ్, వేలూరు మరియప్ప, ఆది, కోళకుర్తి సుదర్శన్, బీటీ రమేష్, ఎస్‌కే మల్లికార్జున, బసవరాజు, చంద్రశేఖర్‌గుప్తా కార్యకర్తలు హాజరయ్యారు.

నేలకొరిగిన వరిపంట పరిశీలన

బొమ్మనహాళ్: ఇటీవల తుఫాన్ కారణంగా వీచిన గాలులకు, కురిసిన వర్షాలకు మండలంలోని రంగాపురంక్యాంప్, ఉద్దేహాళ్ గ్రామాల శివార్లలో హెచ్చెల్సీ ఆయకట్టు పరిధిలో నేలకొరిగిన వరిపంటను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చేతికి వచ్చిన పంట వర్షానికి, గాలులకు నేలకొరిగిపోయిందని, దీంతో రైతులు బాగా నష్టపోయారని తెలిపారు. హెచ్చెల్సీ ఆయకట్టులో నేలకొరిగిన వరిపంటను అంచనా తయారు చేయాలని అధికారులకు ఆదేశించినట్లు చెప్పారు. ప్రభుత్వంతో మాట్లాడి ఎంత అవకాశముంటే అంత రైతులకు సహాయ అందే విధంగా చూస్తామని చెప్పారు. మండలకేంద్రంతో పాటు ఉద్దేహాళ్ గ్రామంలో కనీసం మద్దతు ధర లభించే విధంగా వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇప్పటికే ఈ విషయం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి టీజీభరత్‌తో పాటు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు కూడా పంపారన్నారు. త్వరలో ఉద్దేహాళ్, కణేకల్లులో ప్రభుత్వం తరఫున వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండాపురం కేశవరెడ్డి, తహసీల్దార్ మునివేలు, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు యర్రగుంట్ల వెంకటేశులు, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు


యాడికి సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి

యాడికి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన విలేజ్ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారం కోసమే ఈ సదస్సులను నిర్వహించనున్నట్లు చెప్పారు. భూమి సమస్యలున్న రైతులు సదస్సుల్లో అర్జీలు ఇవ్వాలని సూచించారు. 6వ తేదీన గుడిపాడు గ్రామంలో, 10న కుందనకోట, 12న రాయలచెరువు, 13న ఓబులాపురం, 17న పుప్పాల గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. జనవరి 8వ తేదీ వర కు సదస్సులు జరుగుతాయని పేర్కొన్నారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌కుమార్, ఆర్ఐ క్రిష్ణయ్య, పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

విడపనకల్లు: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సునీతా బాయి వీఆర్వోలు, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 6వ తేదీ నుంచి మండలంలో జరిగే రెవెన్యూ సదస్సులకు అందరూ హాజరు కావాలని తెలిపారు. 6న కడదరబెంచి, 7న ఎన్.తిమ్మాపురం, 10న మాళాపురం, 12న కరకముక్కల, 13న చీకలగురికి, 17న ఉండబండ, 19న అంచనహాలు, 21న పొలికి, 24న గడేకల్లు, 27న వేల్పుమడుగు, జనవరి 2న డొనేకల్లు, 4న హావళిగి, 7న పాల్తూరు, 8న విడపనకల్లు, గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు.

బొమ్మనహాళ్: మండలంలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఈనెల 6వ తేదీ నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మునివేలు తెలిపారు. 6న నేమకల్లు, 7న కురవళ్లి, 9న సిద్ధరాంపురం, 10న బొమ్మనహాళ్, 11న ఉంతకల్లు, 12న ఉద్దేహాళ్, 13న హరేసముద్రం, 16న బండూరు, 17న కళ్లుదేవనహళ్లి, 18న బొల్లనగుడ్డం, 19న గోవిందవాడ, 20న దర్గాహోన్నూరు, 21న శ్రీధరఘట్ట, 23న సింగానహళ్లి, 24న కొళగానహళ్లి, 26న ఏళంజి గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు.

పుట్లూరు: మండలంలోని గ్రామాల్లో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శేషారెడ్డి తెలిపారు. ఈనెల 6నుంచి జనవరి 7వ తేదీ వరకు ఆయా పంచాయతీల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు.

శెట్టూరు: మండలంలోని గ్రామాల్లో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి తెలిపారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని గ్రామాలలో శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుమతి తెలిపారు.

పెద్దపప్పూరు : మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ బాలాజీ రాజు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

కూడేరు: మండలంలోని వివిధ గ్రామాల్లో 7వతేదీ శనివారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దారు మహబూబ్ బాషా తెలిపారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 7న చోళసముద్రం, 9న తిమ్మాపురం, 11న ఎంఎంహళ్లి, జయపురం, 13న ఇప్పేరు, 17న కల్లగళ్ల, 19న మరుట్ల, 21న ఉదిరిపికొండ, 24న కొర్రకోడు, 27న కమ్మూరు, జనవరి 2న బ్రాహ్మణపల్లి, 4న గొట్కూరు, 7న కూడేరు రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు.

నిందితుడి అరెస్టు

గుత్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని కమాట వీధికి చెందిన నాజియా అనే వివాహిత మహిళపై గత బుధవారం కత్తితో దాడి చేసి గాయపరిచిన కేసులో లారీ డ్రైవర్ దాదాఖలందర్‌ను గురువారం అరెస్ట్ చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. నాజియా పని నిమిత్తం తన ఇంటి వద్ద నుంచి బండగేరికి వెళ్తుండగా తాడిపత్రి రోడ్డు కాలనీకి చెందిన దాదాఖలందర్ పాత కక్షలు మనసులో పెట్టుకుని వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెను పొడిచి తీవ్రంగా గాయపరిచాడన్నారు. నిందితుడు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో రైల్వే బ్రిడ్జివద్ద ఉండగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

హుండీల లెక్కింపు

పెద్దపప్పూరు, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని అశ్వత్థంక్షేత్రంలో గల అశ్వత్థనారాయణస్వామి, శ్రీచక్ర భీమలింగేశ్వరస్వామి ఆలయాల్లో గల హుండీ కానుకల్ని గురువారం లెక్కించినట్లు ఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. 2023 సెప్టెంబరు 13 నుంచి 2024 డిసెంబరు 5వరకు భక్తులు హుండీలలో వేసిన కానుకల్ని లెక్కించామని, అందులో రూ.6,15,668 ఆదాయం వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్టు

కళ్యాణదుర్గం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మారెంపల్లి కాలనీకు చెందిన ఓబుళేసు స్థానిక టూటౌన్‌లో గల చౌడమ్మ గుడి వీధిలో కర్ణాటక మద్యం అమ్ముతుండగా పోలీసులు గురువారం దాడులు చేసి అతన్ని అరెస్టు చేశారు. అలాగే 192 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కళ్యాణదుర్గం రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చాపిరి గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ రవికుమార్ బాడుగ నిమిత్తం చాపిరి గ్రామానికి వెళ్లి తిరిగి కళ్యాణదుర్గంకు బయలుదేరాడు. కొద్దిదూరం రాగానే ఆటో ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ప్రమాదంలో రవికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా వుండటంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యాడికి కాలువలో పిచ్చిమొక్కల తొలగింపు

యాడికి, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ఆదేశాలతో యాడికి కాలువలో పిచ్చిమొక్కల తొలగింపు పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. మండల టీడీపీ నాయకులు నాలుగు ఎక్సకవేటర్లను ఏర్పాటు చేసి కాలువను శుభ్రం చేసే పనులు కొనసాగిస్తున్నారు. ఎమ్మెల్యే సొంత నిధులతో పనులకు శ్రీకారం చుట్టారు. కాలువను శుభ్రం చేసే పనులు పూర్తయితే యాడికి కాలువకు నీరు విడుదల చేయనున్నారు. గురువారం పనులను మాజీ ఎంపీ పీ వేలూరు రంగయ్య, పరిమి చరణ్, అమిలినేని సత్య, మాజీ సర్పంచు గోపాల్‌నాయుడు, పరిమి శ్రీహరి తదితరులు పర్యవేక్షించారు.

కూడేరుకు చేరిన పీఏబీఆర్ నీరు


కుడికాలువలో ప్రవహిస్తున్న నీరు

కూడేరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పీఏబీఆర్ కుడికాలువలో ప్రవహిస్తున్న నీరు కూడేరుకు చేరుకున్నాయి. గురువారం ఉదయం కూడేరు దాటేశాయి. ప్రస్తుతం పీఏబీఆర్ నుంచి కుడికాలువకు 545 క్యూస్కెల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే తుంగభద్ర డ్యాం నుంచి 396 క్యూస్కెల నీరు పీఏబీఆర్‌లోకి వస్తున్నట్లు వారు చెప్పారు.

సొంత భవనం ఎన్నడో?

- 40 ఏళ్లుగా సమితి కార్యాలయంలోనే ఎంపీడీఓ కార్యాలయం
- అది కూడా శిథిలావస్థకు చేరిన వైనం
- అసౌకర్యంగా సిబ్బంది విధులు


ఎంపీడీఓ కార్యాలయ భవనంపై చెట్టు మొలవడంతో నెర్రెలు చీలిన గోడలు

కూడేరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయానికి ఇంతరకు సొంతభవనం లేదు. సుమారు 40 ఏళ్ల కిందట నిర్మించిన సమితి కార్యాలయమే దిక్కయింది. అది కాస్తా శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది అసౌకర్యాల నడుమ విధులు నిర్వహించాల్సి వస్తోంది. 1985 వ సంవత్సరంలో సమితి వ్యవస్థను అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు రద్దు చేసి మండల వ్యవస్థను తీసుకొచ్చారు. అప్పటి సమితి కార్యాలయంలోనే ఎంపీడీఓ కార్యాలయం ఏర్పాటు చేశారు. దాదాపు 40 ఏళ్ల అవుతున్నా.. ఆ భవనంలోనే కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఆ భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షాలు వస్తే నీళ్లు కారి ఫైళ్ళు తడిసిపోతున్నాయి.

దీంతో అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక మండల ప్రజా పరిషత్ పాలక వర్గం అక్టోబరు 2021వ సంవత్సరంలో సొంత భవనం నిర్మాణానికి తీర్మాణం చేశారు. ఇందుకు దాదాపు రూ. కోటి 60లక్షల నిధులు అవసరమని నివేదికలు తయారు చేసి జిల్లా పరిషత్‌కు కూడా పంపారు. అక్కడి నుండి రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషన్‌రకు పంపారు. అయితే ఉన్నాధికారుల నుంచి ఎటువంటి చలనం లేకపోయింది. దీంతో చేసేదిలేక ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది శిథిలావస్థ భవనంలోనే కాలం గడుపుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు భవనం పైకప్పు దెబ్బతిని నీరు కారడంతో ఉపాధి హామీ సిబ్బంది గదిలోని ఫైళ్లు మొత్తం తడిసిపోయాయి. దీంతో ఆ సిబ్బంది వారం క్రితం సమీపంలోని సచివాలయ భవనంలోకి మారారు.

కార్యాలయంపై పెరిగిన చెట్టు....

ఎంపీడీఓ కార్యాలయాన్ని పట్టించుకునే వారు లేకపోవడంతో భవనంపై చెట్టు పెరిగి పెద్దదయింది. దీంతో ఆ చెట్టు వేర్లు కార్యాలయ గదుల గోడల్లోకి చొచ్చుకుపోయాయి. దీనివల్ల గోడలు నెర్రెలు చీలాయి. దీంతో ఏ క్షణం ఏమి జరుగుతుందోనని సిబ్బంది భయం, భయంగా కాలం గడుపుతున్నారు. కార్యాలయం మొత్తం వానకు కారుతుండటంతో అధికారులు కూర్చోవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆర్థిక మంత్రి చొరవ చూపాలి

40 ఏళ్ళుగా సొంత భవనం లేని ఎంపీడీఓ కార్యాలయానికి వైసీపీ పాలనలో మొండి చేయి చూపారు. కూటమి ప్రభుత్వంలో అయినా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్పందిస్తే సొంత భవన నిర్మాణానికి నివేదికలు అందిస్తామని అధికారులు తెలుపుతున్నారు. ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థలోనున్న ఎంపీడీఓ కార్యాలయ భవన నిర్మాణానికి ఆర్థిక శాఖ ప్రత్యేక చొరవ చూపి అవసరమైన నిధులు విడుదల చేయాలని నివేదిక ఇస్తామన్నారు.

11వ వార్డులో మార్నింగ్‌వాక్

గుంతకల్లు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 11వ వార్డులో గురువారం టీడీపీ నేత గుమ్మనూరు నారాయణ స్వామి పార్టీ నాయకులతో కలిసి మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి సలస్యలపై ఆరా తీశారు. డ్రైనేజీలు, సీసీరోడ్లు లేవని వార్డు ప్రజలు తెలిపారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నారాయణస్వామి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బండారు ఆనంద్, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, గుడిపాటి ఆంజనేయులు, పెంచలపాడు వెంకటేశులు, న్యాయవాది వెంకటేశులు, జెట్టి సుధాకర్, వనగొండి విజయలక్ష్మి, జీ మహేశ్వర, వీరేష్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి


గొందిపల్లిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జయరాం

గుత్తిరూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అధికారులను ఆదేశించారు. మండలంలోని గొందిపల్లిలో గురువారం ఆయన పర్యటించారు. అక్కడ డ్రైనేజీ సమస్య అధికంగా ఉండడాన్ని గమనించి వెంటనే పరిష్కరించాలని ఏంపీడీఓ ప్రభాకర్‌కు సూచించారు. గ్రామంలో ఇళ్ల ముందర మురుగునీరు అధికంగా పారుతోందని, ఇలా అయితే ప్రజలు అనారోగ్యానికి గురవుతారని అన్నారు. వారంలోగా అన్ని గ్రామాల్లో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే తనయుడు ఈశ్వర్, సోదరుడు, నారాయణ, టీడీపీ మండల కన్వీనర్ బర్దీవలి పాల్గొన్నారు.

బీసీ కాలనీలో ఎమ్మెల్యే పర్యటన


సమస్యలపై ఆరాతీస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

పెద్దవడుగూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బీసీ కాలనీలో గు రువారం ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి పర్యటించా రు. అక్కడ రోడ్లను పరిశీలించారు. ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం అధికంగా ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. గృహాల నుంచి వెలువడిన చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ప్రజలు ఇళ్లలోని చెత్తను చెత్తకుండీలలోనే వేయాలన్నారు. పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పంటపొలాలకు సాగునీరు సమృద్ధిగా ఉందని, రైతులు ఎవరూ సందేహాలు పెట్టుకోవద్దని పేర్కొన్నారు. అనంతరం స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, జిల్లా తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రెటరీ దివాకర్‌రెడ్డి, నాయకులు గంగరాజుయాదవ్, నాగరాజు, లక్ష్మీనారాయణ, దస్తగిరి, చిరంజీవి ఉన్నారు.

రస్తా వివాదం రచ్చ.. రచ్చ

యాడికి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూట్రాళ్లపల్లి గ్రామంలో రస్తా వివాదం గురువారం రచ్చ రచ్చగా మారింది. ఇంటి ముందర ఉన్న రాళ్లను తొలగించడానికి గురువారం వెళ్లిన పంచాయతీ అధికారులు, పోలీసులకు చుక్కెదురైంది. తూట్రాళ్లపల్లి గ్రామంలో వెంకటనాగిరెడ్డికి, ఆదిరెడ్డికి ఇంటిముందర ఉన్న రస్తా స్థలం విషయం గత కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. తన ఇంటివద్దకు ఎద్దులబండి ట్రాక్టర్ వెళ్లడానికి రస్తాలో రాళ్లు అడ్డుపెట్టారని వీటిని తొలగించి తనకు న్యాయంచేయాలని వెంకటనాగిరెడ్డి ఉప లోకాయుక్తను ఆశ్రయించాడు. రాళ్లను తొలగించాలని తెలుపుతూ ఉపలోకాయుక్త నుంచి గ్రామపంచాయతీ అధికారులకు ఉత్తర్వులు వచ్చాయి. ఈ ఉత్తర్వుల మేరకు గురువారం పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్ సిబ్బందితో కలిసి రాళ్లను తొలగించడానికి వెళ్లారు. అయితే ఆదిరెడ్డి కుటుంబ సభ్యులు దీనిని అడ్డుకున్నారు. అధికారులకు ఆదిరెడ్డి కుటుంబసభ్యులకు వాగ్వాదం చోటుచేసుకుంది. ఎంత సర్దిచెప్పినా సమస్య పరిష్కారం కాకపోవడంతో సాయంత్రం అధికారులు వెనుదిరిగారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

ఉపాధ్యాయుడిపై దాడి హేయం: ఫ్యాప్టో


గుత్తిలో ఫ్యాప్టో నాయకుల నిరసన

కుందుర్పి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటిలోని కొత్తపల్లి జడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయుడు మహ్మద్ ఏజియాస్‌పై అదే పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు దాడి చేయడం హేయమైన చర్య అని, ఈ ఘటనను ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని ఏపీ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయ్‌భాస్కర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని మాయదార్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాల వద్ద ఉపాధ్యాయులతో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో కూడా టీచర్లకు భద్రత లేకుండా పోవడం బాధాకరమన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలన్నారు. కొంతమంది విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలుగా మారి ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. విద్యార్థులు మద్యం, గంజాయి, డ్రగ్స్ లాంటి వాటి జోలికి వెళ్లకుండా ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపించి చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయుడు మహ్మద్ ఏజియాస్ మరణంపై సమగ్ర విచారణ చేసి కారకులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. నిరసనలో ఉపాధ్యాయులు మధు, లింగారెడ్డి, ధనుంజయ, సరోజ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈ ఘటనను ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మయ్య, రాష్ట్ర మాజీ కౌన్సిలర్లు బీసీ తిమ్మప్ప, రామప్ప, నాయకులు ఖండించారు. తరగతి గదిలో ఉపాధ్యాయుడి మృతి పట్ల విద్యాశాఖ, పోలీసులు నిర్లక్ష్యం వహించకుండా సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు తెలియజెప్పాలన్నారు. నిష్పక్షపాతంగా విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గుత్తి: పట్టణంలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట ఫ్యాప్టో ఉపాధ్యాయుల సంఘం నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిపై దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అతడి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. అనంతరం ఎంఈఓ రవినాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఫ్యాప్టో నాయకులు ప్రసాద్, ఓబులేసు, ఆంజనేయులు, బసవరాజు, శంకరయ్య, ప్రకాష్‌రెడ్డి, శ్రీనివాసులు, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

పాతకొత్తచెరువుకు ట్రాక్టర్


పాతకొత్తచెరువుకు చేరిన ట్రాక్టర్

గుంతకల్లు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు మోహన్ అధీనంలో ఉన్న పంచాయతీ ట్రాక్టర్ యథా స్థానానికి చేరింది. మూడు నెలల కిందట పాతకొత్తచెరువు పంచాయతీలో పారిశుధ్య పనుల కోసం ప్రభుత్వం కేటాయించిన ట్రాక్టర్‌ను మోహన్ తీసుకెళ్లి నెలగొండలో సొంత పనులకు వినియోగించుకుంటున్నాడు. దీనిపై ఆంధ్రజ్యోతి బుధవారం ఓ కథనాన్ని ప్రచురించిన సంగతి విదితమే. ఈ విషయం సమస్యాత్మకంగా మారడంతో మండలాభివృద్ధి అధికారి, ఈఓఆర్డీ, పంచాయతీ కార్యదర్శి ట్రాక్టరును వెంటనే తెచ్చి అప్పగించాలంటూ ఒత్తిడి తెచ్చారు. దీంతో అతను బుధవారం ట్రాక్టర్‌ను నెలగొండ నుంచి పాతకొత్తచెరువు గ్రామానికి తెచ్చి సర్పంచుకు అప్పగించాడు.